

ఎక్కడ గోదావరి.. ఎక్కడ దుబ్బాక

నవ తెలంగాణ-దుబ్బాక

దుబ్బాక ప్రాంతం కరువు కాటకాలతో తల్లడిల్లిపోయేది. బోరు బావుల్లో నీళ్లు లేక పంటలు పండక వర్షం కోసం ఆకాశానికి ముఖంపెట్టి ఎదురు చూసేవాళ్లం అని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కోమటిరెడ్డి వెంకట నరసింహారెడ్డి అన్నారు. బుధవారం దుబ్బాక పురపాలిక కేంద్రంలోని బాలాజీ గార్డెన్స్ లో ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సాగునీటి దినోత్సవం కార్యక్రమంలో మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి, బీ ఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కోమటిరెడ్డి వెంకట నరసింహారెడ్డి హాజరై మాట్లాడారు. ఈ ప్రాంత రైతుల గోసను తీర్చాలన్న సంకల్పంతో సీఎం కేసీఆర్ ఎక్కడో ఉన్న గోదావరి నది నీళ్లతో నేడు దుబ్బాక ప్రాంతంలోని మడిమడికి,ఇంటింటికి సాగు,తాగునీరును అందిస్తున్నాడని చెప్పుకొచ్చారు. 600 మీటర్ల ఎత్తు నుంచి నీటిని తెచ్చి మల్లన్న సాగర్ ప్రాజెక్టు కాలువల ద్వారా నియోజకవర్గంలోని ప్రతి చెరువును నింపుతున్నాడన్నారు. కాలేశ్వరం ప్రాజెక్టు గొప్పదనం గురించి వార్తాపత్రికల్లో పతాక శీర్షికలు వచ్చాయని గుర్తు చేశారు.సీఎం కేసీఆర్ పంట పెట్టుబడి సాయం అందించి రైతులకు అండగా నిలిచారన్నారు.అనంతరం మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి చేతుల మీదుగా వెంకట నరసింహారెడ్డి సొంత ఖర్చులతో కొనుగోలు చేసిన "తెలంగాణ ప్రభుత్వ సంక్షేమ పథకాలతో కూడిన గోడ గడియారాలను"ఆవిష్కరించారు. బిఆర్ఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు గుండవెల్లి ఎల్లారెడ్డి,మహమ్మద్ సలీం,కరికె శ్రీనివాస్ పలువురున్నారు.

1

నవతెలంగాణ



మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట

గురువారం 8 జూన్ 2023

సాగుకు సిద్ధమవుతున్న అన్నదాత

- నేడే మృగశిర కార్తె ప్రారంభం
- మార్కెట్‌లో చేపలకు పెరగనున్న గిరాకీ
- రుతుపవనాలు రాకతో చల్లబడుతున్న వాతావరణం





నవతెలంగాణ వర్గల్

భారతదేశంలో ఎక్కువ కుటుంబాలు వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తారు. వ్యవసాయ సాగులో కార్తెలకు అధిక ప్రాధాన్యత ఉంటుంది. కార్తెని బట్టే వ్యవసాయ పనులను ప్రారంభిస్తుంటారు. ఖగోళ విజ్ఞానం ప్రకారం మనకు 27 నక్షత్రాలు, 12 రాశులుంటాయి. ప్రతి రాశిలో సూర్యుడు సుమారుగా నెల రోజుల కాలం పాటు సంచరిస్తాడు. సూర్యుడు వృషభ రాశిలో ఉన్న మృగశిర నక్షత్రంలోకి ఎప్పుడైతే వస్తారో అప్పుడే మృగశిర కార్తె ప్రారంభమవుతుంది. ఇలా సూర్యుడు ఏ నక్షత్రంలో సంచరిస్తారో ఆ నక్షత్రం పేరుతో 27 కార్తెలు ఏర్పడతాయి. కృత్తిక, రోహిణి కార్తెలలో ఎండలు ఎక్కువగా ఉంటాయి. మృగశిర కార్తె ప్రారంభంతోనే వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు కలుగుతాయి. మృగశిర కార్తె రావడంతో వాతావరణం చల్లబడుతుంది. వ్యవసాయానికి సంబంధించిన పనులను మృగశిర కార్తె నుండే సిద్ధం చేసుకుంటారు. మృగశిర కార్తెలో ముసలి ఎద్దు కూడా రంకెలు వేస్తుందనే సామెతలు వాడుతుంటారు. కార్తులకు సంబంధించిన వ్యవసాయ సామెతలు జన బాహుళ్యంలో అనేకం ఉన్నాయి.

మృగశిర కార్తె ప్రారంభం కాగానే ఒక్కసారిగా వాతావరణం మార్పు చెందడం వలన మానవ శరీరంలో ఉష్ణోగ్రతలు హెచ్చుతగ్గులు ఏర్పడతాయి. వాటిని సమతుల్యం చేయడానికే మాంసాహారులు చేపలను, శకాహారులు ఇంగువ, బెల్లం కలుపుకొని సేవించడం వలన శరీర ఉష్ణోగ్రతలు అదుపులో ఉంటాయని నమ్ముతారు. ఇదే పద్ధతిని గత కొన్ని సంవత్సరాలుగా పాటించడం వలన ఆచారంగా మారిపోయింది. వ్యవసాయ పనులను ఈ కార్తె ప్రారంభంతోనే ఆరంభిస్తారు. గ్రామీణ ప్రాంతాల్లోని రైతు కుటుంబాలు ఈ కార్తెని పండగలా జరుపుకుంటారు.

మన దేశంలో వ్యవసాయంలో కార్తె నిర్ణయం, కార్తుల ప్రాధాన్యత ఎక్కువగా ఉంటుంది. కార్తె ప్రవేశం ద్వారా ఏ కార్తెలో వర్షాలు కురుస్తాయి? ఏ కార్తెలో వర్షాలు కురవవు.. ఏ కార్తెలో వాతావరణం ఎలా ఉంటుందనేది గ్రామీణ ప్రాంతాల్లోని రైతులకు పూర్తి అవగాహన ఉంటుంది. కార్తె ప్రవేశం ద్వారానే వ్యవసాయ సాగుకు సంబంధించిన ప్రణాళికాబద్ధంగా సాగు పనులను చేస్తుంటారు.

మార్కెట్‌లో చేపలకు గిరాకీ

ఈ నెల 8న మృగశిర కార్తె. ఈ రోజును ఎక్కువ మంది ప్రజలు పండగలా జరుపుకుంటారు. మృగశిర కార్తె అంటేనే చేపలు గుర్తొస్తాయి. ఎందుకంటే మృగశిర కార్తె రోజు చేపలను తినడం అనేది కొన్ని సంవత్సరాల నుంచి ఆనవాయితీగా వస్తోంది.

మృగశిర కార్తె రోజు చేపలు తినడం వలన ఆరోగ్యం కలుగుతుందని భావిస్తారు. మృగశిర కార్తె ప్రవేశం సందర్భంగా ఎక్కువ మంది చేపలు కొనుగోలు చేస్తారు. చేపలకు ఈ రోజున ఎక్కువగా గిరాకీ ఉంటుంది. వర్గల్ మండల వ్యాప్తంగా పలు చెరువులలో చేపలను పట్టి విక్రయాలకు సిద్ధంగా ఉంచారు. అలాగే జిల్లా వ్యాప్తంగా చేపల మార్కెట్లు రద్దీగా మారనున్నాయి.

మండలంలో గుప్తనిధుల వేట



నవ తెలంగాణ టేక్మాల్

మండలంలో మాఫియా ముఠాలు చెలరేగి గుట్టుచప్పుడు కాకుండా గుప్తనిధుల వేట కొనసాగిస్తున్నారు. మూడు రోజుల కిందట మండల పరిధిలోని వేల్పుగొండ గ్రామంలోని దేవల దేవతల చెరువులో గుప్త నిధుల తవ్వకాల కోసం దుండగులు రెక్కి నిర్వహించారు. గుహకు అడ్డంగా ఉన్న భైరవ విగ్రహాన్ని పెకిలించి గుప్తనిధుల కోసం తవ్వకాలు చేపట్టారు. అటుగా వెళ్లిన పశువులకాపరి ఇది గమనించి గ్రామస్తులకు సమాచారం అందించడంతో దుండగులు పారిపోయారు. గ్రామస్తులందరూ సర్పంచ్ దృష్టికి తీసుకోగా సర్పంచ్ బోరింగ్ నారాయణ గ్రామానికి చెందిన ఓ తాగుబోతు ఈ పని చేశాడని కొట్టిపారేశారు. అతని మందలించడం కోసం పోలీస్ స్టేషన్కు పిలిపించి, మాట్లాడారు. గ్రామంలోని వృద్ధులు ఈ విషయంపై చర్చించుకుంటూ కొన్ని ఆసక్తికరమైన సంఘటనలు చెప్పారు. గతంలో కొందరు గ్రామస్తులందరూ లోపల ఏముందో చూడడం కోసం దివిటీలు పట్టుకొని గుహలోకి దిగితే... దిగిన వారు మళ్లీ తిరిగి రాలేదని, చెప్పుకోవడం ఒళ్లు గగ్గుర్లు పట్టే విధంగా ఉంది. ఈసారి గుప్తనిధులు తవ్వినవారు ఒకరేనా, ఇతనికి సహాయంగా ఇంకెవరైనా వెళ్లారా వెళ్లినవారు మరి మాయమైనట్లేనా.. తాగుబోతు ఎలా తిరిగి వచ్చాడని అందరి మదిలే ప్రశ్న ఏమైనప్పటికీ పోలీసులు ఈ విషయంపై లోతుగా పరిశీలించాలని కోరుతున్నారు.

సీబీఐ అధికారులంటూ మోసం



నవతెలంగాణ- కొండాపూర్

సీబీఐ అధికారుల మంటూ మహిళలను బెదిరించి.. ఆమె మెడలో పెస్తెల తాడును చోరీ చేసిన నిందితులను కోర్టుకు రిమాండ్ చేసిన సంఘటన బుధవారం కొండాపూర్ పోలీసుస్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... ఈ నెల 2న మధ్యాహ్నం 2.30 గంటలకు కొండాపూర్ మండలంలోని తేర్పోల్ గ్రామానికి చెందిన సూరు ప్రమీల తన కూతురు సిరి చందనతో కలిసి ఇంటో ఉన్నారు. అదే సమయాంలో ముగ్గురు కారులో వచ్చి తాము సీబీఐ అధికారులం, మీ ఇంట్లో తనిఖీ చేయాలని చొరబడ్డారు. ఇంట్లోని సామగ్రిని చిందరవందరగా పడేస్తుండగా ప్రమీల మీరెవరని కేకలు పెట్టింది. దీంతో వచ్చిన ముగ్గురు ప్రమీల చెంపై కొట్టారు. అరిస్తే చంపేస్తానని బెదిరించారు. ప్రమీల మెడలో ఉన్న మూడున్నర తులాల బంగారం పుస్తెల తాడు గుంజుకున్నారు. డబ్బులు ఇవ్వాలని బెదిరించి అక్కడి నుండి పారిపోయారు. ప్రమీల ఫిర్యాదు మేరకు కొండాపూర్ పోలీసులు కేసు దర్యాప్తు ప్రారంభించారు. బుధవారం ఉదయం 10.30 గంటలకు మల్కాపూర్ చౌరస్తా వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న కొండాపూర్ మండలం తేర్పోల్ గ్రామానికి చెందిన సంధిల గౌస్, పటాన్‌చెరు మండల ముత్తంగికి చెందిన సాయి జాదవ్, సదాశివపేట మండలం ఆత్మకూర్ గ్రామానికి చెందిన వడ్డె లక్ష్మిలను పోలీసులు అరెస్టు చేశారు. అందోల్ మండలం బ్రాహ్మణపల్లికి చెందిన కారు డ్రైవర్ పరారీలో ఉన్నాడని పోలీసులు తెలిపారు. బంగారు పుస్తెలతాడును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు నిందితులను కోర్టుకు రిమాండ్ చేశారు. ఎస్సై బి.వెంకటేశం, ఏఎస్ఐలు గౌసొద్దీన్, సూర్య, హెడ్ కానిస్టేబుల్ కృష్ణ, కానిస్టేబుల్ శ్రీరామ్, హేంసింగ్, శివ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వం స్పందించాలి



- మహిళా రెజ్లర్లను లైంగికంగా వేధించిన బీజేపీ ఎంపీ బ్రిజిభూషణ్‌చరణ్ సింగ్‌ను వెంటనే అరెస్టు చేయాలి
- అతని పార్లమెంటు సభ్యత్వాన్ని వెంటనే రద్దు చేయాలి
- సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు డిమాండ్







నవ తెలంగాణ సిద్దిపేట అర్బన్

మహిళా రెజ్లర్లను లైంగికంగా వేధించిన బీజేపీ ఎంపీ బ్రిజిభూషణ్ చరణ్ సింగ్‌ను వెంటనే అరెస్టు చేసి, అతని పార్లమెంటు సభ్యత్వం రద్దు చేయాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు డిమాండ్ చేశారు. బుధవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా చుక్క రాములు మాట్లాడుతూ ఢిల్లీ నడిబొడ్డులో తమను లైంగికంగా వేధించిన బీజేపీ ఎంపీ బ్రిజు భూషణ్ చరణ్ సింగ్‌ను అరెస్టు చేసి తమకు న్యాయం చేయాలని మహిళా రెజ్లర్లు పోరాటం నిర్వహిస్తున్నా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, హోం మంత్రి అమిత్ షా స్పందించకపోవడం దారుణమన్నారు. భరతమాత ముద్దు బిడ్డలమని, మహిళలకు అత్యంత గౌరవాన్ని ఇస్తున్నామని చెప్పుకునే బీజేపీ ప్రభుత్వానికి ఢిల్లీలో గత కొంతకాలంగా రెజ్లర్లు చేస్తున్న న్యాయమైన పోరాటం కనబడటం లేదా అని ప్రశ్నించారు. మహిళా రెజ్లర్లు ప్రపంచవ్యాప్తంగా, దేశం గౌరవపడే విధంగా ఎన్నో పతకాలు సాధిస్తే... వారిని ఈ ప్రభుత్వం చిన్నచూపు చూడడమేంటన్నారు. న్యాయం జరగకపోతే తమకు వచ్చిన పతకాలను గంగా నదిలో కలుపుతామని ప్రకటించినా ఈ ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. కేంద్రం ప్రభుత్వం స్పందించి బ్రిజ్‌భూషణ్‌ను వెంటనే అరెస్టు చేసి, అతని పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేయాలని, లేనిపక్షంలో సీఐటీయూ ఆధ్వర్యంలో ప్రజా పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి కాములు గోపాలస్వామి, జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య, జిల్లా ఉపాధ్యక్షురాలు దాసరి కళావతి, ఎం పద్మ, మధు, జిల్లా కోశాధికారి జి. భాస్కర్, జిల్లా సహాయ కార్యదర్శి లు చొప్పరి రవికుమార్, సింగిరెడ్డి చంద్రారెడ్డి, తునికి మహేష్ జిల్లా నాయకులు చింతల వెంకటయ్య, జాలిగపు శిరీష, కిరణ్, తాడిశెట్టి ఆంజనేయులు, రోహిత్ పాల్గొన్నారు.

నవతెలంగాణ-సదాశివపేట, సంగారెడ్డి

మహిళా రెజ్లర్లను లైంగిక వేధించిన బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ చరణ్ సింగ్‌ను వెంటనే అరెస్టు చేసి, అతని పార్లమెంటు సభ్యత్వం రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం నిరసనలు చేపట్టారు. సంగారెడ్డిలో సీఐటీయూ ఆఫీస్ నుంచి న్యూ బస్టాండ్ వరకు ర్యాలీగా వెళ్లి.. కేంద్ర ప్రభుత్వ దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా సదాశివపేటలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బీరం మల్లేషం, సంగారెడ్డిలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.సాయిలు వేర్వేరుగా మాట్లాడుతూ దేశానికి గోల్డ్ మెడల్ తీసుకొచ్చిన మహిళా రెజ్లర్ల పట్ల లైంగిక వేధింపులకు పాల్పడిన ఎంపీ బ్రిజ్ భూషణ్ చరణ్ సింగ్‌ను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. 40 రోజుల నుంచి జంతర్మంతర్ వద్ద మహిళా రెజర్లు పోరాటం చేస్తున్నా అతన్ని ఎందుకు అరెస్టు చేయడం లేదని ప్రశ్నించారు. ఇప్పటికీ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, హోం మంత్రి అమిత్ షా స్పందించకపోవడం దారుణమన్నారు. భారతమాత ముద్దుబిడ్డలుగా మహిళలకు అత్యంత గౌరవాన్ని ఇస్తున్నామని చెప్పుకునే బీజేపీ ప్రభుత్వానికి మహిళా రెజ్లర్ల పోరాటం కనిపించడం లేదా అని ప్రశ్నించారు. న్యాయం జరగకపోతే తమ గౌరవ పతకాలన్నీ గంగా నదిలో కలుపుతామని చెప్పినప్పటికీ ఈ ప్రభుత్వం స్పందించకపోవడం దుర్మార్గమన్నారు. వారి గౌరవ పతకాలను గంగా నదులో కలపడం అంటే భారతదేశ గౌరవ ప్రతిష్టలను కలపడమే అవుతుందని.. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి బ్రిజ్ భూషణ్‌ను వెంటనే అరెస్టు చేయాలన్నారు. లేనిపక్షంలో సీఐటీయూ ఆధ్వర్యంలో ప్రజా పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమాల్లో జిల్లా జిల్లా ఉపాధ్యక్షులు వి.ప్రవీణ్ కుమార్, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎం. యాదగిరి, సీఐటీయూ నాయకులు నర్సింలు, యాదయ్య, కార్మికులు లక్ష్మీ, నాగమణి, అశోక్, సంగమేశ్, సురేష్, దుర్గయ్య, రాములు, నగేష్, ఎస్.శ్రీనివాస్, జి శ్రీనివాస్, సంజీవరావు మొగులయ్య చందర్ ఆంజనేయులు నర్సింలు రాజు మోహన్ అంజయ్య ప్రకాశం తదితరులు పాల్గొన్నారు.

నవ తెలంగాణ- గజ్వేల్

మహిళా రెజ్లర్లను లైంగిక వేధింపులకు గురి చేసిన బిజెపి ఎంపీ బ్రిజిభూషణ్ చరణ్ సింగ్‌ను వెంటనే అరెస్టు చేసి, అతని పార్లమెంటు సభ్యత్వం రద్దు చేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎస్కేవలి, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు నందబోయిన ఎల్లయ్య డిమాండ్ చేశారు. సీఐటీయూ, యూటీఎఫ్, ఐద్వా, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బుధవారం అంబేద్కర్ విగ్రహం నుండి గ్రౌండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఢిల్లీ నడిబొడ్డులో కొంత కాలంగా తమను లైంగికంగా వేధింపులకు గురిచేసిన బిజెపి ఎంపీ బ్రిజు భూషణ్ చరణ్ సింగ్‌ను అరెస్టు చేసి తమకు న్యాయం చేయాలని మహిళా రెజ్లర్లు పోరాటం నిర్వహిస్తున్నా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, హోం మంత్రి అమిత్‌షా స్పందించకపోవడం దారుణం అన్నారు. భరతమాత ముద్దుబిడ్డలుగా మహిళలకు అత్యంత గౌరవాన్ని ఇస్తున్నామని చెప్పుకునే బిజెపి ప్రభుత్వం నేడు ఢిల్లీలో గత కొంతకాలంగా రెజ్లర్లు చేస్తున్న న్యాయమైన పోరాటం ఈ ప్రభుత్వానికి కనబడటం లేదా? ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి హోం మంత్రి అమిత్ షా కి కనబడటం లేదా అని ప్రశ్నివారు. మహిళల పట్ల అత్యంత గౌరవ ఉన్నట్టుగా వివరిస్తున్న ఈ ప్రభుత్వ తీరు మహిళా రేజర్లకు ఆ గౌరవం దక్కదా అని ప్రశ్నించారు. మహిళా రెజ్లర్లు ప్రపంచవ్యాప్తంగా దేశం గౌరవ పడే విధంగా ఎన్నో పతకాలు సాధిస్తే వారిని ఈ ప్రభుత్వం చిన్న చూపు చూడడమేంటని అన్నారు. తమకు న్యాయం జరగకపోతే తమకు వచ్చిన గౌరవ పతకాలన్నీ గంగా నదిలో కలుపుతామని చెప్పినప్పటికీ ఈ ప్రభుత్వం స్పందించకపోవడం దారుణం అన్నారు. వారి గౌరవ పతకాలను గంగా నదిలో కలపడం అంటే భారతదేశ గౌరవ ప్రతిష్టలని గంగానదిలో కలపడం అవుతుందని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ప్రధానమంత్రి ఇంద్ర మోడీ, హోం మంత్రి అమిత్‌షా వెంటనే బ్రిజు భూషణ్‌ను వెంటనే అరెస్టు చేయాలని, అతని పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేయాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో చంద్రారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, రామచంద్రం, రాణి ప్రభావతి శేఖర్ చంద్ర శేఖర్, కిరణ్, బండ్ల స్వామి, రాజు వెంకటచారి రోహిత్తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి దినోత్సవం నాడే రైతు ఆత్మహత్య



నవ తెలంగాణ-దుబ్బాక

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జూన్ 7న సాగునీటి దినోత్సవం అనే కార్యక్రమాన్ని నిర్వహించింది. ఇదే రోజున రైతు తనకున్న పొలంలో వేసిన బోర్లలో నీళ్లు పడలేవన్న మనస్థాపంతో ఉరేసుకుని మృతి చెందాడు. ఈ ఘటన సిద్దిపేట జిల్లా దుబ్బాక పురపాలిక పరిధిలోని చెల్లాపూర్ 2వ వార్డులో బుధవారం జరిగింది. తనకున్న 2 ఎకరాల్లో సాగు చేయడానికి నీళ్ల లేక ఇన్నాళ్లు ఇరుగుపొరుగు వారి బోర్లపై ఆధారపడ్డాడు. ఇలా ఎన్నాళ్ళని భావించిన ఆ రైతు అప్పు తెచ్చిన డబ్బులతో రెండు రోజుల కిందట కొత్తగా 2 బోర్లు వేయించాడు. అవి ఫెయిలయ్యాయి. దీనికోసం చేసిన అప్పులు తీర్చే మార్గం కనబడక.. ఎలా తీర్చాలో అన్న మనస్థాపానికి గురైన ఆ రైతు తన వ్యవసాయ పొలం వద్దనున్న చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. దుబ్బాక ఎస్ఐ బత్తుల మహేందర్, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఇదే వార్డుకు చెందిన కంకణాల లక్ష్మయ్య (67) అనే రైతు తన భార్య లక్ష్మి,కొడుకు స్వామిలతో కలిసి జీవనం కొనసాగిస్తున్నాడు. తనకున్న 2 ఎకరాల్లో సాగు కోసం కొత్తగా రెండు బోర్లు (200 ఫీట్లు ఒకటి,300 ఫీట్లు మరొకటి) వేయించాడు. నీళ్లు పడక 2 బోర్లు ఫెయిలయ్యాయి. వీటి కోసం చేసిన అప్పులు తీర్చే మార్గం కనబడక తీవ్ర మనస్థాపానికి గురయ్యాడు. బుధవారం మధ్యాహ్నం తన వ్యవసాయ పొలం వద్దనున్న చెట్టుకు చీరతో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబీకులు వెంటనే దుబ్బాక ఏరియా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే లక్ష్మయ్య చనిపోయినట్లు వైద్యులు తెలిపారు. లక్ష్మయ్య మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించడం జరిగిందని, భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మహేందర్ తెలిపారు.

సమస్యలపై ఐక్యంగా పోరాడాలి

సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి

నవతెలంగాణ-చేర్యాల



గ్రామంలో నెలకొన్న సమస్యలపై పార్టీ కార్యకర్తలు ఐక్యంగా పోరాడాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి పిలుపునిచ్చారు. చేర్యాల మండల పరిధిలోని శభాష్ గూడెం గ్రామ పార్టీ శాఖ సమావేశం బుధవారం దాసరి కనకయ్య అధ్యక్షతన నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా ఆముదాల మల్లారెడ్డి హాజరై మాట్లాడుతూ శభాష్ గూడెం గ్రామంలో అనేక సమస్యలు పేరుకుపోయి పరిష్కారం కాకుండా ఉన్నాయన్నారు. ఎన్నికలకు ముందు ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి గ్రామానికి చేసిన వాగ్దానాలు ఏ ఒక్కటి అమలు కాలేదని విమర్శించారు. ఏకగ్రీవ సర్పంచు ఎన్నిక అయినందున గ్రామ పంచాయతీకి ప్రభుత్వం విరాళంగా ఇచ్చే రూ.25 లక్షలు నేటికీ ఇవ్వలేదన్నారు. కొత్త గ్రామ పంచాయతీ గ్రామ అభివృద్ధిని పట్టించుకోవడంలో పాలక పార్టీ ప్రజా ప్రతినిధులు విఫలం చెందారన్నారు. గ్రామంలో మంచినీటి సమస్య, పెన్షన్లు, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, ఉపాధి హామీ, రైతు, కులవృత్తిదారుల సమస్యలు, దేవాలయ భూమి సమస్య, ముదిరాజులకు చెరువు సమస్య నేటికీ అపరిష్కృతంగా మిగిలాయని, ఈ సమస్యలపై రాబోయే రోజుల్లో సీపీఐ(ఎం) ప్రజలను ఏకం చేసి ఐక్యంగా పోరాడుతుందన్నారు. పార్టీలకతీతంగా నిర్వహించే పోరాటాలకు ప్రజలంతా మద్దతు తెలపాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరించే ప్రజా వ్యతిరేక విధానాలు, మతోన్మాదం, కార్మిక వర్గ ప్రజా వ్యతిరేక విధానాలపై రైతు వ్యతిరేక విధానాలపై పార్టీ అలుపెరుగని పోరాటాలు నిర్వహి స్తుందన్నారు. ఐక్యంగా పోరాడితే ప్రజలే విజయం సాధిస్తారన్నారు. ప్రజా పోరాటాలకు గ్రామంలోని మేధావు లందరూ చేయూతనిస్తూ, ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. అంతకుముందు పార్టీ పతాకాన్ని మల్లారెడ్డి ఆవిష్కరించారు. సమావేశంలో పార్టీ చేర్యాల మండల కార్యదర్శి కొంగరి వెంకట మావో, జిల్లా కమిటీ సభ్యులు బండ కింది అరుణ్ కుమార్, దాసరి ప్రశాంత్, అరవింద్, రంజిత్ రెడ్డి, నాగపురి కనకయ్య, గంధాల బాలు, కొమురయ్య, శ్రీశైలం, సంపత్, రమేష్, కరుణాకర్, ప్రకాష్, నాగేష్, నరేష్, మురళి, సురేష్, యాదగిరి పాల్గొన్నారు.

కంపెనీల్లో యువతకు ఉద్యోగ అవకాశాలు



నవ తెలంగాణ కొండపాక

ప్రముఖ ఐటీ కంపెనీ ప్రతినిధులతో కలిసి బుధవారం జిల్లా కలెక్టర్ ఐటీ టవర్ ప్రారంభం ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్, ఐటీ శాఖ మంత్రులు కేటీఆర్, హరీష్‌రావు ఆలోచన మేరకు సిద్దిపేట జిల్లాలో నిర్మించిన ఐటీ టవరులో ప్రముఖ ఐటీ కంపెనీలు భాగస్వామ్యం కావడం సంతోషకరమన్నారు. వీటిలో ఓఎస్ఐ డిజిటల్, జోలాన్ టెక్, విసన్ ఇన్ఫో టెక్, అమిడాయ్ ఎడ్యుటెక్, ఫిక్సిటీ టెక్నాలజీస్, ఇన్నోసోల్, థోరాన్ టెక్నాలజీస్, బీసీడీసీ క్లౌడ్ సెంటర్స్, ర్యాంక్ ఐటీ సర్వీసెస్ తదితర కంపెనీలు స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు ఆయా కంపెనీల ప్రతినిధులు వివరించారు. హైదరాబాద్ నుంచి అతీ సమీపంలో ఉన్న సిద్దిపేట ఐటీ టవర్ ఆహ్లాదకరమైన వాతావరణంలో, రాజీవ్ రహదారిపై ఉన్నదని, సమీపంలోనే త్రీస్టార్ హోటల్, అర్బన్ ఫారెస్ట్ పార్కులు, పోలీసు కమిషనరేట్ ఉండటంతో పటిష్టమైన శాంతి భద్రతల నిర్వహణ వల్ల ఎలాంటి సమస్యలు లేకుండా ఉంటాయని తెలిపారు సమీక్షలో ఐటీ కంపెనీ ప్రతినిధులు సిద్దిపేట ఐటీ టవర్ నిర్వాహకులు చంద్రకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకుని వృద్ధుడి ఆత్మహత్య



నవ తెలంగాణ కొండపాక

మనస్థాపంతో వృద్ధుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన కుకునూరుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొడకండ్ల గ్రామంలో చోటు చేసుకుంది గ్రామానికి చెందిన పిట్ల యాదగిరి(70) గత కొంతకాలంగా తన ఇంటి సమస్యలతో మనస్తవంతో గురై బుధవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో గ్రామంలోని డబుల్ బెడ్ రూమ్ల సమీపంలో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని కొడుకు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు కుకునూరుపల్లి పుష్పరాజ్ తెలిపారు.

నెర్రెలువారిన భూముల్లో పచ్చని పంటలు



నవ తెలంగాణ-దుబ్బాక

'గతంలో ప్రభుత్వాలు, ఎంతోమంది నాయకులు పాలించినా దుబ్బాకలో బీడు భూములే దర్శనమిచ్చేవి. వర్షాలు లేక అప్పులు తెచ్చి బోర్లు వేస్తే నీళ్ల పడక ఎంతోమంది రైతన్నలు ఆత్మహత్యలు చేసుకున్న అత్యంత కరువు ప్రాంతం దుబ్బాక. ఈ బాధలు చూసిన రైతు బిడ్డ సీఎం కేసీఆర్ రైతులను ఆదుకోవాలన్న దృఢ సంకల్పంతో కాలేశ్వరం ప్రాజెక్టును నిర్మించారు. మల్లన్న సాగర్ కాలువల ద్వారా దుబ్బాక ప్రాంతంలో నెర్రెలు వారిన భూముల్లో నేడు పచ్చని పంట పొలాలు పండిస్తున్నారు. నాడు ఎటుచూసినా అడుగంటిపోయిన చెరువులు కనబడేవి. అవే చెరువులు నేడు నిండు కుండలను తలపిస్తున్నాయి. నేడు ఎర్రటి ఎండల్లోనూ కూడవెల్లి వాగు పారుతున్నదంటే ఇది ముమ్మాటికీ సీఎం కేసీఆర్ ఘనత' అని మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి అన్నారు. బుధవారం దుబ్బాక పట్టణ కేంద్రంలోని సాయి బాలాజీ గార్డెన్స్ లో ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన "సాగునీటి దినోత్సవం" లో మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి ముఖ్యాతిథిగా హాజరై మాట్లాడారు. మున్సిపల్ చైర్ పర్సన్ గన్నె వనిత భూమిరెడ్డి,వైస్ చైర్ పర్సన్ అధికం సుగుణ బాలకిషన్ గౌడ్,ఎంపీపీ కొత్త పుష్పలత కిషన్ రెడ్డి,ఏఎంసి చైర్ పర్సన్ చింతల జ్యోతి కృష్ణ,బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కోమటిరెడ్డి వెంకటనరసింహా రెడ్డి,ఆత్మా కమిటీ చైర్మన్ నమిలే భాస్కరాచారి,పిఏసిఎస్ చైర్మన్ శేర్ల కైలాష్, కమిషనర్ పాతూరి గణేష్ రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు, ఇరిగేషన్ ఈఈ వేణు బాబు, రవీందర్ రెడ్డి, సాయిబాబా, డీఈలు హరికిషన్, శ్రీనివాస్, శిరీష్, సీతారామరాజు, ఏఈలు విష్ణువర్ధన్ రెడ్డి, జునైద్ అలీ, అమర్, మాల్లోజు పాల్గొన్నారు.

మండుటెండల్లో ఉపాధి కూలీల అవస్థలు

- పని ప్రదేశాల్లో కనీస వసతులు కరువు
- రెండుసార్లు ఫొటోలతో ఇబ్బందులు



నవ తెలంగాణ-దౌల్తాబాద్

మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో జాతీయ ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కూలీల పరిస్థితి అధ్వానంగా మారింది. స్థానికంగా పని కల్పించాలనే లక్ష్యంతో తెచ్చిన ఉపాధి హామీ చట్టం పూర్తిగా అమలు కావడం లేదు. నిబంధనల ప్రకారం కూలీలు పనిచేసే చోట కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలని ఉన్నా ఎలాంటి వసతులు కల్పించడంలేదు. పూట గడవాలంటే ఉపాధి పనులకు వెళ్లక తప్పని కూలీలు అసౌకర్యాల లేమితో ఎండలో నానా ఇబ్బందులు పడుతూ పనులు చేస్తున్నారు. ఉపాధి హామీ పథకం కింద ప్రస్తుతం గ్రామాలకు దూరంగా ఉన్న చెరువుల్లో గుంతలు, పూడిక తీసే పనులు కొనసాగుతున్నాయి. ఎర్రటి ఎండలో కష్టపడి చమటోడ్చి పని చేసిన వారికి కాసేపు సేద తీరడానికి సైతం అందుబాటులో నీడలేని దుస్థితి నెలకొంది. పని ప్రదేశంలో టెంట్లు వేయాల్సి ఉండగా అధికారులు ఆ మాటే మర్చిపోయారు. ఉపాధి హామీ చట్టం ప్రకారం పని ప్రదేశంలో నీడ, మంచినీరు, ఫస్ట్ ఎయిడ్ కిట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మజ్జిగ ప్యాకెట్లు అందుబాటులో ఉండాలని నిబంధనలు ఉన్నప్పటికీ అవి ఏమీ కానరావడం లేదు. పని చేస్తున్న సమయంలో గాయాలయితే ప్రథమ చికిత్స అందించడానికి ఫస్ట్ ఎయిడ్ కిట్లు సైతం పని ప్రదేశంలో ఉండటం లేదు. నాలుగు ఐదు సంవత్సరాల నుండి కేంద్ర ప్రభుత్వం ఫస్ట్ ఎయిడ్ కిట్లు, ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లను సరఫరా చేయడమే మానేసింది.

గ్రామాల్లో సిగల్స్ అంతంతే..

ఉపాధి హామీ చట్టం కింద పని చేసే కూలీల హాజరును ప్రతిరోజు కచ్చితంగా నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం యాప్ ద్వారా నమోదు చేయాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఇదే అంశంపై రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి కమిషనర్‌కు పంచాయతీరాజ్ అధికారులకు సర్క్యులర్ పంపారు. గ్రామాల్లో సెల్ ఫోన్‌కు సిగల్స్ రావడమే పెద్ద కష్టం.. అలాంటిది మేట్లు ప్రతిరోజు ఆన్లైన్లో హాజరును నమోదు చేసుకోవడం కత్తి మీద సామే.. దీంతో కూలీలు తమ హాజరు నమోదుపై అయోమయానికి గురవుతున్నారు. ఇప్పటికే ప్రయోగాత్మకంగా అమలు చేసిన యాప్ అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. కేంద్ర నిర్ణయం రాష్ట్రాలపై ఉపాధి కూలీల ప్రయోజనాలకు తీవ్ర నష్టం కలిగించేలా చేస్తుంది. ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేయడంలో భాగంగానే తెరపైకి తెచ్చిన ఈ విధానాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని వ్యవసాయ కార్మిక ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

కేంద్రం చెప్పింది ఒకలా.. క్షేత్రస్థాయిలో మరోల..


ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేయడానికి ఈ యాప్ ఉపయోగిస్తున్నారని అవగాహన లేని వారి పరిస్థితి ఏంటని పలువురి ప్రశ్న. ఉపాధి హామీ కూలీలు పిట్టల్లా రాలిపోతున్నా పట్టించుకునేవారు కరువయ్యారని నిబంధనల ప్రకారం వసతులు కల్పించాలని కనీసం రోజుకు రూ.500 పడేలా చూడాలని ఉపాధి హామీ కూలీలు డిమాండ్ చేస్తున్నారు.

కూలి రూ.300 ఇవ్వాలి

గ్రామాల్లో చేపడుతున్న ఉపాధి హామీ పనులు దూర ప్రాంతాల్లో చేపట్టడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. అనేక ఇబ్బందుల మధ్య పనులు చేపట్టిన కూలి గిట్టుబాటు కావడం లేదు. గ్రామానికి సుమారు మూడు నాలుగు కిలోమీటర్ల దూరంలో పనులు చేపడుతున్నారు. దీంతో వృద్ధ కూలీలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. కనీసం రోజు కూలి రూ.300 అయినా పడేలా చూడాలి.

- ఉపాధి కూలీలు

నవతెలంగాణ 2
సంగారెడ్డి
గురువారం 08 జూన్ 2023



శిశు గృహను ఆకస్మికంగా సందర్శించిన జే.హనుమంతరావు



నవతెలంగాణ-సంగారెడ్డి

జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్. శశిధర్ రెడ్డి సూచనలతో తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థ ఆదేశాల కనుగుణంగా బుధవారం సంగారెడ్డి బైపాస్ రోడ్డులో గల శిశు గృహను జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి జే. హనుమంతరావు ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా జడ్జ్ శిశు గృహ (బాల సంరక్షణ కేంద్రం) అధికారులతో కలిసి పర్యటించి పిల్లలకు ఏ విధమైన సదుపాయాలు అందిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. పిల్లలకు కావలసిన పౌష్టికాహారం, ఆరోగ్యం, పిల్లల చదువు ఇతర వసతులు ఏ విధంగా ఉన్నాయో అడిగి తెలుసుకుని, వారికి పెడుతున్న భోజనం అక్కడి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని శిశు గృహ అధికారులకు సూచించారు. ఈ సందర్శనలో శిశు గృహ అధికారులు మొగులయ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సదాశివపేట తహసీల్‌లో మంత్రి ఆకస్మిక తనిఖీలు



నవతెలంగాణ-సదాశివపేట

సదాశివపేట పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని మంత్రి హరీశ్‌రావు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సంగమేశ్వర ఎత్తిపోతల పథకంలో భాగంగా ప్రాజెక్ట్ నిర్మాణానికి భూమి పూజ కోసం మునిపల్లి వెళ్లిన మంత్రి.. సదాశిపేట తహసీల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడే ఉన్న రైతులను ధరణి పోర్టల్ ద్వారా ఏ విధంగా తమ సమస్యలు పరిష్కారం అవుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. ధరణి పోర్టల్ తమకు మేలు చేసిందని మంత్రికి సమాధానం ఇచ్చారు. గతంలో ధరణి రాకముందు భూమిని ఇంట్లో వాళ్ల పేరు మీద మార్పించాలన్న అధికారుల చుట్టూ కాళ్లు అరిగేలా తిరుగాల్సిన పరిస్థితి ఉండేదని, ఇప్పుడు ధరణి ఆన్లైన్లో లో త్వరగా పనులు అవుతున్నాయన్నారు. ధరణి తమకు ప్రయోజనకరంగా ఉందని రైతులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ శరత్ కుమార్, మాజీ ఎమ్మెల్యే రాష్ట్ర చేనేత అభివృద్ధి సంస్థ చైర్మన్ చింతా ప్రభాకర్, అదనపు కలెక్టర్ వీరారెడ్డి, ఆర్డీఓ, అధికారులు పాల్గొన్నారు.



బాధిత కుటుంబానికి ఎల్ఓసీ అందజేసిన మంత్రి

నవతెలంగాణ-సంగారెడ్డి

సదాశివపేట పట్టణానికి చెందిన గిరిజరాణి కుటుంబ సభ్యులకు సంగారెడ్డి పట్టణంలోని కలెక్టరేట్ క్యాంపు కార్యాలయంలో రూ.2లక్షల విలువ చేసే ఎల్ఓసి చెక్కును మంత్రి హరీశ్‌రావు బుధవారం అందజేశారు. ఎల్ఓసి చెక్కు మంజూరు చేయడానికి కృషి చేసిన చింత ప్రభాకర్‌కు గిరిజరాణి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీడీసీ చైర్మెన్ కసాల బుచ్చిరెడ్డి పాల్గొన్నారు.



మా అంబి మహిళా సేవా సమితి సేవలు అభినందనీయం

నవతెలంగాణ-ఐడిఏబొల్లారం

మా అంబి మహిళా సేవా సమితి సేవలు అభినందనీయమని పటాన్‌చెరు సబ్ డివిజన్ ఆఫీసర్ భీం రెడ్డి అన్నారు. బుధవారం బొల్లారం లోని పోచమ్మ బస్తీ లో మా అంబి మహిళా సేవా సమితి నూతన కార్యాలయాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలందరూ ఒక సంఘంగా ఏర్పడి ఎవరికి ఏకష్టం వచ్చిన అందురు కలిసి కట్టుగా ఉంటూ తమ సమస్యల్ని పరిష్కరించడం అభినందనీయమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో దీనానాద్, రేఖా దేవి, పరంశీల, మహిళలు పాల్గొన్నారు.

క్యాన్సర్ వ్యాధి బాధితునికి ఆర్థిక సాయం



నవతెలంగాణ-గుమ్మడిదల

మండలంలోని అనంతారం గ్రామానికి చెందిన ఊట్ల ప్రమీల క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నది. వారిది పేద కుటుంబం కావడంతో.. బీఆర్ఎస్ గ్రామ నాయకులు ఈ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంటనే స్పందించి తన సోదరుడు గూడెం మధుసూదన్ రెడ్డి ద్వారా రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని హాస్పిటల్ ఖర్చుల నిమిత్తం బాధిత కుటుంబానికి అందజేయించారు. ఈ కార్యక్రమంలో చిమ్ముల నరేందర్ రెడ్డి, పెరుగు లక్ష్మణ్, వార్డు సభ్యులు రమణ, వెంకటేష్, మాజీ సర్పంచ్ కొమ్ము కృష్ణయ్య, మన్నే మహేష్ యాదవ్, కావలి నర్సింగ్ రావు,పోచయ్య, నర్సింలు, పద్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆడపడుచు వివాహానికి పుస్తెమెట్టెలు అందజేత



నవతెలంగాణ-సదాశివపేట

సదాశివపేట పట్టణంలోని చాకలి కేరిలో నివాసం ఉంటున్న ఓ నిరుపేద ఆడపడుచు వివాహానికి మన సమాజం ఫౌండేషన్ ఆధ్వర్యంలో పుస్తెమెట్టెలు, చీర అందజేసినట్టు ఆ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు మడుపతి మహేష్ స్వామి తెలిపారు. మన సమాజం ఫౌండేషన్ ఏర్పాటు చేసి నాలుగేండ్లు పూర్తి కావస్తుందని.. ఈ నాలుగేండ్లలో సుమారుగా 54 నిరుపేద ఆడపడుచు వివాహాలకు పుస్తెమెట్టల అందజేశామన్నారు. వృద్ధులకు దుప్పట్లు, విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు రాత పుస్తకాలు పెన్నులు, దీర్ఘకాలిక అనారోగ్యంతో బాధపడుతున్న వారికి మందులు కొనడానికి సాయం చేసినట్టు తెలిపారు. మొదటగా ఒక వాట్సాప్ గ్రూప్‌గా ఏర్పడి సమాజంలో ఉడతా భక్తిగా పలు రకాల సేవా కార్యక్రమాలు చేయాలని సంకల్పంతో ఈ సమాజం ఫౌండేషన్ ఏర్పాటు చేశామన్నారు. ఈ ఫౌండేషన్ గ్రూపులో ఉన్న సభ్యులందరి సహకారంతో మునుముందు మరెన్నో సేవా కార్యక్రమాలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మన సమాజం ఫౌండేషన్ గౌరవ సభ్యులు కరుణాకర్, చరణ్ కుమార్, రవీందర్, హరీష్ కుమార్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మ ఆలయానికి రూ.25,000 విరాళం



నవతెలంగాణ-ఐడిఏబొల్లారం

శివ్వంపేట మండలం బిజిలీపూర్ గ్రామంలో నిర్మిస్తున్న దుర్గమ్మ ఆలయానికి శ్రీపూర్ణానంద స్వామిజీ సేవాదళ్ అధ్యక్షుడు అంతిరెడ్డిగారి బాలసుబ్రహ్మణ్య రెడ్డి రూ.25,000 విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆలయ నిర్మాణానికి తమవంతు సాయం అందించడం తన అదృష్టంగా భావిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో రమేష్, కమ్మరి రవీందర్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభా పురస్కారాలు అందజేత



నవతెలంగాణ-సదాశివపేట

ఇటీవలే విడుదలైన టెన్త్ మరియు ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రభుత్వ ఉపాధ్యాయుడు లోపలికోట పద్మశాలి సమాజం సభ్యులు పోల శ్రీనివాస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు అందజేశారు.. ఈ కార్యక్రమంలో లోపలికోట పద్మశాలి సంఘం అధ్యక్షుడు మునిపల్లి రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి పోల వెంకటేశం, కోశాధికారి నాగారం గోపాల్,సభ్యులు సత్యం, నర్సింలు, కాశీనాదం, గడిల గణేష్,పోల సిద్ధిరాములు సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నేడు గడ్డపోతారంలో చెరువుల పండగ

నవతెలంగాణ-జిన్నారం

రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జిన్నారం మండల పరిధిలోని గడ్డపోతారంలోని అయ్యమ్మ చెరువుకట్ట మైసమ్మ గుడి ప్రాంగణంలో నేడు(గురువారం) 'ఊరూరా చెరువుల పండుగ' కార్యక్రమాన్ని భారీ స్థాయిలో నిర్వహించనున్నట్లు సర్పంచ్ పులిగిల్ల ప్రకాశం చారి, ఈవో నరేష్ బాబు తెలిపారు. బోనాలు, బతుకమ్మ ఊరేగింపులు, మత్స్యకారుల బృందాలతో వేడుకలు జరుగుతాయన్నారు. పెద్ద ఎత్తున పాల్గొని ఈ వేడుకను విజయవంతం చేయాలని కోరారు. హాజరైన వారందరికీ భోజన సదుపాయం కల్పించినట్టు తెలిపారు.



రైతులపై దొంగదెబ్బ

నవతెలంగాణ-కొండాపూర్

మండలంలో కొందరు దుండగులు రైతుల పొలాల వద్ద గల బోరు మోటార్ వైర్లను దొంగలిస్తూ.. కాయ కష్టం చేసుకునే రైతన్న పొట్టగొడుతున్నారు. ఇప్పటికే ప్రకృతి వైపరీత్యాలతో తీవ్రంగా నష్టపోయిన అన్నదాతకు.. నేడు దొంగలు కంటి మీద కునుకులేకుండా చేస్తున్నారు. మండల పరిధిలోని మాందాపూర్ గ్రామంలో గడిల రాములు, మాదారం రాములు, తలారి సంజీవులు, కుమ్మరి నరసింహులు ఈ విధంగా సుమారు 15 మందికి చెందిన వైర్లను దుండగులు దొంగలించారు. వైర్లను కట్ చేయడం, వాటిని కాల్చి అందులో ఉన్న కాపర్‌ను అమ్ము కొని సొమ్ము చేసుకుంటున్నారు. ఇలాంటి ఘటనలు జరగడం ఇది రెండోసారి. రాత్రి వేళల్లో పొలాల వద్ద ఎవరు ఉండకపోవడంతో దొంగలు రెచ్చిపోతున్నారు. పోలీసులు గట్టి నిఘా పెంచి దొంగలను పట్టుకుని.. కఠినంగా శిక్షించాలని రైతులు కోరుతున్నారు.

కొండెక్కిన కోడిమాంసం

- కేజీ రూ.280, స్కిన్‌లెస్ రూ.300
- తీవ్ర ఎండలకు గుంపులుగా కోళ్లు మృత్యువాత
- మరికొన్ని బరువు తక్కువగా వస్తుండడంతో కొరత ఏర్పడి.. ధరల్లో మార్పులు

నవతెలంగాణ-జోగిపేట

మొన్నటి వరకు చికెన్ ధర రూ.200 మాత్రమే ఉండగా ప్రస్తుతం బహిరంగ మార్కెట్లో రేటు భగ్గుమంటున్నది. సామాన్యుడు ఊహించని విధంగా కిలో రూ. 280కు చేరుకుంది. స్కిన్‌లెస్ అయితే కిలో రూ.300 వరకు పెరిగింది. ఈనెల 2 నుంచి ధరలు పెరుగుతున్నాయి. రెండు మూడు రోజుల్లో ఈ ధరలు కూడా పెరిగే అవకాశం ఉందని చికెన్ విక్రయదారులు అంటున్నారు. చికెన్ రేట్లు అమాంతం పెరగడంతో సామాన్యుల పై అదనపు భారం పడుతోంది. చికెన్ వ్యాపారులు మాత్రం ఇవి రికార్డు ధరలు అని అంటున్నారు. మేక, గొర్రె మాంసం ధరలు ప్రస్తుతం ప్రజలకు అందుబాటులో లేకుండా పోయాయి. సామాన్య, మధ్యతరగతి ప్రజలు ఎక్కు వగా ఆదరించేది చికెన్ మాంసమే. చిన్న, పెద్దా తేడా లేకుండా ప్రతి నోట చికెన్ అన్నవ రాట వస్తుంది. ఇప్పుడు రేట్లు పెరగడ ంతో ఆయా వర్గాలకు కోడికూర దొరకడమూ కష్టంగా మారుతున్నది.

ఎండల ధాటికి కోళ్ల మృత్యువాత..

సూర్యుడు రోజురోజుకు ఉగ్రరూపం దాల్చి జనాన్ని ఉక్కిరి బిక్కిరి చేస్తుండగా, నోరులేని జీవాలు భానుడి భగభగలకు తట్టుకోలేకపోతున్నాయి. కోళ్ల పరిశ్రమ పై ప్రచండ భానుడు విశ్వ రూపం చూపుతున్నాడు. దీంతో కోళ్లు గుట్టలుగుట్టలుగా రాలిపోతున్నాయని కోళ్ల పరిశ్రమ వర్గాలు తెలిపాయి. దీంతో కోళ్ల కొరత కూడా రోజు రోజుకు ఎక్కువ అవుతోందని అంటున్నారు.

ఆదివారం వచ్చిందంటే అప్పోసొప్పో చేసైనా సరే కౌసుకూర వండుతుంటారు. వారానికి చివరి రోజునో, సెలవు దినమనో చాలా మంది మాంసం వంటకాలకే ప్రాధాన్యతను ఇస్తుంటారు. డబ్బులున్న వారు మటన్ తీసుకెళ్తే.. సామాన్యులు చికెన్ తీసుకెళ్తుంటారు. అయితే ప్రస్తుతం చికెన్ ధరలు ఆకాశన్నంటుతుండడంతో.. సామాన్యులకు కౌసు దొరకడం కష్టంగా మారింది. ఎండలు మండిపోతుండడంతో చాలా వరకు కోళ్లు మృత్యువాత పడుతున్నాయి. అంతేకాకుండా ఎండ వేడిమికి బరువు కూడా తక్కువగా వస్తుండడంతో.. చికెన్ ధరలు పెరిగిపోతున్నాయి. మటన్ రేట్ల మాదిరే చికెన్ రేట్లు కూడా పెరిగిపోతుండడంతో.. సామాన్యులు ఇక కౌసు తినడం కష్టమే.

కోళ్ల బరువులు తగ్గడంతో...

ఎండల వేడిమికి కోళ్ల బరువులు చాలా తక్కువగా వస్తున్నాయి. దీంతో ధరల్లో మార్పులు చోటు చేసుకుంటున్నాయి. బరువు తగ్గడంతో కూడా కోళ్ల పరిశ్రమలకు పెట్టుబడులు సరిగ్గా రాకపోవడంతో కోళ్ల కొరత ఏర్పడుతుంది. కోళ్ల బరువులు ఎక్కువగా ఉంటేనే వారికి గిట్టుబాటు వస్తుంది.

ఆకాశన్నింటిని ధరలు..

వేసవి ఎండలకు కోళ్లు అతలాకుతలమవుతున్నాయి. దీంతో పరిశ్రమలు ధరలను అమాంతం పెంచేశాయి. కోళ్లు పెద్ద సంఖ్యలో చనిపోవడంతో వాటి బరువు తగ్గడం వంటి కారణాలతో చికెన్ ధరలు అనివార్యంగా పెరిగాయి అని తెలుస్తోంది. కోళ్ల పరిశ్రమ నుంచి బహిరంగ వ్యాపారుల వద్దకు వచ్చే వరకే రేట్లు పెరిగి రావడంతో వ్యాపారస్తులు కూడా ఏమీ చేయలేక ప్రజలకు పెరిగిన రేట్లతో విక్రయిస్తున్నారు.



వినియోగదారులకు తప్పని తిప్పలు...

చికెన్ ధరలు పెరగడంతో వినియోగదారులకు తిప్పలు తప్పడం లేదు. వేసవి సెలవులు ఒకవైపు ,పెండ్లిల్లు, శుభ కార్యాలు, అశుభ కార్యాలకు చికెన్‌ను ఉపయోగిస్తుంటారు. ప్రతి గ్రామంలో సంత రోజు ప్రతి ఒక్కరూ కచ్చితంగా చికెన్ మాంసా న్ని కొనుగోలు చేస్తారు. రేట్లు అధికం కావడంతో మరింత భారం పెరుగుతోందని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెరిగిన రేట్లతో చికెన్ క్రయ విక్రయాలు కూడా రోజుకు రోజుకు తగ్గుతున్నట్లు వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చికెన్ రేట్లు రోజు పెరగడంతో జోగిపేట పట్టణ కేంద్రంలో చికెన్ వ్యాపారులు తమ షాపులను బందు పెట్టుకుంటున్నారు. చికెన్ షాపులలో కోళ్లు కూడా దొరకడం లేదు.



నేలకొరిగిన స్తంభాలు.. పట్టించుకోని అధికారులు

నవతెలంగాణ-కొండాపూర్

ఇటీవలే సంభవించిన ఈదురు గాలులకు మండల పరిధిలోని గంగారం గ్రామంలో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. సుమారు 10కి పైగా విద్యుత్ స్తంభాలు నేలకొరగడంతో.. 20 మందికి పైగా రైతుల పొలాల్లో విద్యుత్ వైర్లు పడ్డాయి. ఇది జరిగి 20 రోజులు గడుస్తున్నా విద్యుత్ శాఖ అధికారులు సరిచేయలేదు. ఓ పక్క పంట సాగు కోసం అందరూ దుక్కులు సాగు చేస్తుంటే.. తమ పొలాలు మాత్రం ఎట్టికి ఉన్నాయంటూ రైతులు వాపోతున్నారు. వర్షాలు అధికమైతే దుక్కులు దున్నడం ఇబ్బంది అవుతుందని.. అలాగే పంట కూడా ఆలస్యం అవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కింద పడి ఉన్న వైర్లతో ప్రమాదమూ లేకపోలేదని ఆందోళన చెందుతున్నారు. ఈ విషయాన్ని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయిందని రైతులు చెబుతున్నారు. పొలాలలో పడిపోయిన వైర్లను దొంగలు ఎత్తుకుపోయే అవకాశం ఉందని అధికారులకు చెప్పిన స్పందించడం లేదని.. స్తంభాలకు ఉన్న ఇనుప సామాగ్రి తదితర వస్తువులు కూడా జాగ్రత్త చేయాల్సిన అధికారులు నిమ్మకునీరెత్తినట్టుగా వ్యవహరిస్తున్నారన్నారు.

శరవేగంగా అభివృద్ధి పనులు

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

నవతెలంగాణ-అమీన్‌పూర్

అమీన్ పూర్ మున్సిపల్ పరిధిలో శరవేగంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని పటాన్‌చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని 18 వ వార్డు శ్రీరామ్ నగర్ కాలనీలో రూ.60 లక్షల మున్సిపల్ నిధులు, జీవిఆర్ ఎంటర్ప్రైజెస్ సంస్థ అందించిన రూ.10 లక్షలతో నిర్మించ తలపెట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే జిఎంఆర్ శంకుస్థాపన చేశారు. అనంతరం చక్రపురి కాలనీలో నూతన శివాలయం నిర్మాణానికి నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ.. ప్రజల సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా పని చేస్తున్నావన్నారు. ప్రతి కాలనీలో నెలకొన్న సమస్యలను స్థానిక ప్రజాప్రతినిధుల ద్వారా తెలుసుకొని వాటి పరిష్కారానికి ప్రణాళిక బద్ధంగా నిధులు కేటాయిస్తూ పారదర్శకంగా పనులు చేపడుతున్నామన్నారు. దీంతోపాటు మున్సిపల్ పరిధిలో నూతన దేవాలయాల నిర్మాణాలకు సంపూర్ణ సహకారం అందిస్తున్నామన్నారు.అనంతరం అమీన్ పూర్ మండల పరిధిలోని పటేల్ గూడ గ్రామంలో స్మశాన వాటిక కోసం 15 లక్షల రూపాయలతో నిర్మించనున్న సిసి రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, వైస్ చైర్మన్ నందారం నరసింహా గౌడ్, అమీన్ పూర్ ఎంపీపీ ఈర్ల దేవాన ందం, జెడ్పీటీసీ గంగుల సుధాకర్ రెడ్డి, పటేల్ గూడ సర్పంచ్ నితీశా శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



మండు వేసవిలోనూ చెరువులు, కుంటల్లో జలకల



నవతెలంగాణ-పటాన్‌చెరు

అపర భగీరథుడు ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో సాగునీటి రంగంలో చేపడుతున్న సంస్కరణ మూలంగా మండు వేసవిలోను చెరువులు అలుగులను దూకుతున్నాయని, ప్రతి రైతు పుష్కలంగా పంటలు పండించుకుంటున్నారని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా 6వ రోజైన బుధవారం పటాన్‌చెరు పట్టణంలోని సాకి చెరువుకట్ట పైన నిర్వహించిన సాగునీటి దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డికి కోలాటాలు, బతుకమ్మలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం సాగునీటి రంగంలో చేపట్టిన అభివృద్ధి నివేదికను అధికారులు వివరించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రెడ్డి కాకతీయుల కాలంలో చెరువులను పునరుద్ధరించి పూడికలను తీస్తే తిరిగి ప్రత్యేక తెలంగాణ ఏర్పడిన అనంతరం ముఖ్యమంత్రి కేసీఆర్ మిషన్ కాకతీయ పథకం ద్వారా చెరువులకు పునర్జీవం తీసుకుని వచ్చారన్నారు. దీని మూలంగా చెరువులు నిండుకుండలా మారి ఆయకట్టు విస్తీర్ణం పెరిగి అంచనాలకు మించి పంటలు పండిస్తున్నారని సంతోషం వ్యక్తం చేశారు. ఒకవైపు సాగునీరు, మరోవైపు 24 గంటల విద్యుత్తు.. మద్దతు ధర అందించడం మూలంగా రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందారని ఆనందం వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లోని చెరువులతోపాటు జిహెచ్ఎంసి, మున్సిపాలిటీల పరిధిలోని చెరువుల కట్టల అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తున్నామన్నారు. పటాన్ చెరు పట్టణంలోని సాకి చెరువు అభివృద్ధికి ఇంకార్ సంస్థ సహకారంతో ఐదు కోట్లు నిధులు కేటాయించడం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ సుష్మా శ్రీ వేణుగోపాల్ రెడ్డి, జడ్పిటిసిలు సుప్రజా వెంకట్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, కార్పొరేటర్లు సింధు ఆదర్శ్ రెడ్డి, పుష్ప నగేష్, చెరువుల విభాగం సూపరింటెండెంట్ ఇంజనీర్ ఆనంద్, ఇరిగేషన్ డిప్యూటీ ఈఈ రామస్వామి, నళిని, ఆయా మండలాల ఎంపీడీవోలు, వివిధ శాఖల అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

యువజన కాంగ్రెస్ రాష్ట్ర జాయింట్ కార్యదర్శిగా మల్లికార్జున్

నవతెలంగాణ-జహీరాబాద్

యువజన కాంగ్రెస్ రాష్ట్ర జాయింట్ కార్యదర్శిగా ముల్గి మల్లికార్జున్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా బుధవారం మల్లికార్జున్ మాట్లాడుతూ.. యువజన కాంగ్రెస్ తెలంగాణ స్టేట్ జాయింట్ కార్యదర్శిగా తనను నియమించడం మరింత బాధ్యతను పెంచిందన్నారు. జహీరాబాద్ నియోజకవర్గంలో అత్యధిక మెంబర్‌షిప్‌లు చేసి.. రాష్ట్రంలోనే టాప్ 2గా నిలిచామన్నారు. పని చేసే వారిని యువజన కాంగ్రెస్ గుర్తించి మంచి స్థానం కల్పించిందన్నారు. గతంలోనూ యువజన కాంగ్రెస్ జహీరాబాద్ అసెంబ్లీ వైస్ ప్రెసిడెంటుగా, పార్లమెంట్ జనరల్ సెకరెటరీగా, జిల్లా ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించానని.. ప్రస్తుతం రాష్ట్ర జాయింట్ సెక్రెటరీగా నియమించినందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. తనకు అన్ని విధాలుగా సహకరించిన మాజీ మంత్రి డాక్టర్ జె గీత రెడ్డి , జహీరాబాద్ ఎంపీపీ గిరిధర్ రెడ్డి, యువజన కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు శివసేన రెడ్డి, సురభి ద్వివెది ఇన్చార్జి టీపీవైసి సయ్యద్ ఖలిద్ అహ్మద్, రమేశ్ బాబు, జిల్లా అధ్యక్షులు ఉదయ్ శంకర్ పాటిల్ , నియోజక వర్గ నాయకులకు, పట్టణ, మండల, బూత్ స్థాయి నాయకులకు, ప్రతీ ఒక్కరికీ హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలిపారు. కష్టపడి పనిచేసి పార్టీ అభివృద్ధికి శాయశక్తుల్లా కృషి చేస్తానన్నారు.



అగ్ని ప్రమాద బాధితురాలికి మధుసూదన్‌రెడ్డి చేయూత

- లక్ష రూపాలయ ఆర్థిక సాయం అందజేత
- రూ.20 లక్షల బ్యాంకు రుణానికి సహకారం అందిస్తామని హామీ

నవతెలంగాణ-అమీన్‌పూర్

అగ్నిప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన చిరు మహిళా వ్యాపారికి బి ఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి అండగా నిలిచి, చేయూతను అందించారు. అమీన్ పూర్ మండలం పటేల్ గూడ గ్రామ పరిధిలోని సిద్దార్థ కాలనీకి చెందిన నాగేశ్వర రావు తన భార్యతో కలిసి ఇంట్లోనే చీరలు, ఫాన్సీ స్టోర్ వ్యాపారం నిర్వహిస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. మంగళవారం ప్రమాదవశాత్తు జరిగిన అగ్ని ప్రమాదంలో సామాగ్రి మొత్తం అగ్నికి ఆహుతి అయింది. స్థానిక బీఆర్ ఎస్ పార్టీ నాయకుల ద్వారా సమాచారం తెలుసుకున్న గూడెం మధుసూ దన్‌రెడ్డి మంగళవారం సాయంత్రం ప్రమాద బాధితులను పరామర్శించారు. అధైర్య చెందొద్దని స్థానిక శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ద్వారా ప్రభుత్వపరంగా పూర్తిస్థాయిలో ఆదుకుంటామని హామీ ఇచ్చారు. తక్షణసాయంగా లక్ష రూపాయలు అందించారు. ప్రభుత్వపరంగా మరో రూ.20 లక్షల రుణాన్ని అందించేందుకు సహకరిస్తామన్నారు. అగ్ని ప్రమాదంలో తీవ్ర నష్టానికి గురైన తమను ఆదుకునేందుకు ముందుకు వచ్చిన మధుసూదన్ రెడ్డికి బాధితులు కృతజ్ఞతలు తెలిపారు.



పరిశ్రమల చేయూత అభినందనీయం

నవతెలంగాణ-జిన్నారం

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో పరిశ్రమల యాజవాన్యాలు భాగస్వామ్యం కావడం అభినందనీయమని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ప్రశంసించారు. జిన్నారం మండలం గడ్డపోతారంలో జర్మనీ దేశానికి చెందిన ఏఈటి లేబరేటరీస్ సంస్థ తమ సిఎస్ఆర్ ప్రాజెక్టులో భాగంగా కోటి రూపాయలతో నిర్మించిన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల నూతన భవనాన్ని సంస్థ ప్రతినిధులు, సంగారెడ్డి జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ కుంచాల ప్రభాకర్, స్థానిక సర్పంచ్ పులిగిల్ల ప్రకాశం చారి ఇతర ప్రజా ప్రతినిధుల బృందంతో కలిసి ఎమ్మెల్యే జిఎం ఆర్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో ప్రభుత్వ విద్యా రంగం శరవేగంగా అభివృద్ధి చెందుతుం దన్నారు. కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా నాణ్యమైన విద్యను అందించడంతోపాటు ఉచితంగా పాఠ్య పుస్తకాలు, ఏకరూప దుస్తులు, మధ్యాహ్న భోజనం లాంటి సదుపాయాలు ప్రభుత్వం కల్పిస్తున్నదన్నారు. వీటి తోపాటు ఈ విద్యా సంవత్సరం నుండి నోటు పుస్తకాలను సైతం పాఠశాలల విద్యార్థులకు పంపిణీ చేస్తోందన్నారు. పటాన్చెరు నియోజకవర్గంలో ప్రభుత్వం అందించే నిధులతో పాటు పరిశ్రమల సహకారంతో అభివృద్ధి పనులను శరవేగంగా చేపడుతున్నామన్నారు. జర్మనీ సంస్థ ఏఈటి లేబరేటరీస్ కోటి రూపాయలతో ప్రభుత్వ పాఠశాల భవనం నిర్మించడం సంతోషకరమన్నారు. భవిష్యత్తులోనూ ఇదే స్ఫూర్తితో మరిన్ని సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఈ సందర్భంగా జర్మనీ సంస్థ ఏఈటి లేబరేటరీ ప్రతినిధులకు సూచించారు. సామాజిక సేవ కోణంలో పాఠశాల విద్యార్థుల కోసం వారు చేపట్టిన ఈ కార్యక్రమం ప్రశంసనీయమైనదంటూ ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులను ఎమ్మెల్యే జిఎంఆర్ అభినందించారు. అనంతరం బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించారు. బడిబాట కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టాలని సంబంధిత వర్గాలకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మమత వెంకటేష్, పరిశ్రమ ఎండిలు ఓలీవర్ స్నైడార్, క్రిస్టియన్ రూపో, సిఎఫ్ఓ స్వప్నీల్ సింగ్, ఎంపీటీసీ జానా భాయ్, మాజీ సర్పంచ్లు అశోక్, శ్రీనివాస్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఎంపీ బ్రిజ్ భూషణ్‌ను వెంటనే అరెస్టు చేయాలి



నవతెలంగాణ-పటాన్‌చెరు

మహిళా రెజ్లర్లను లైంగికంగా వేధించిన బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్‌ను వెంటనే అరెస్టు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు కే రాజయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలంలోని పాశమైలారంలో గల కిర్బీ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో పకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం రాజయ్య మాట్లాడుతూ.. బ్రిజ్ భూషణ్‌ను వెంటనే అరెస్టు చేయాలని ఢిల్లీలో పెద్ద ఎత్తున ఆందోళన జరుగుతుంటే.. ప్రధాన మంత్రి నోరు విప్పకపోవడం దుర్మార్గమన్నారు. దేశానికి పతకాలు సాధించిన వారి పట్ల ఇదేనా మర్యాద అన్నారు, వాళ్ళకి ఇచ్చే గౌరవం ఇదేనా అని ప్రశ్నించారు. రోడ్డు మీదకు వచ్చి నిరసన చేస్తుంటే బీజేపీ ప్రభుత్వం ఘోరంగా అవమానిస్తుందని అన్నారు. పోలీసుల చేత బలవంతంగా అరెస్టు చేయించడం, నిరసన శిబిరాన్ని తొలగించడం సిగ్గుచేటన్నారు, మహిళలకు వ్యతిరేకంగా ఈ ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. ఇది మహిళా వ్యతిరేక ప్రభుత్వమన్నారు. ఇప్పటికైనా బ్రిజ్ భూషణ్‌ను ప్రభుత్వం అరెస్టు చేయకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. వారి పోరాటానికి అండగా ఉంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి వి ఎస్ రాజు, నాయకులు నాగప్రసాద్, తలారి శ్రీను, సుధాకర్, లాకాన్, ప్రభు, మహేశ్వర్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

రైతుల అవసరాలే ఆసరాగా.. డీలర్ల దందా

నవతెలంగాణ-సంగారెడ్డి

విత్తనాల విషయంలో రైతుల అవసరాలను ఆసరాగా తీసుకుని డీలర్లు డబ్బులు దండుకుంటున్నారని తుమ్మలపల్లి పృథ్వీరాజ్ ఆరోపించారు. బుధవారం తెలంగాణ మంజీరా రైతు సమాఖ్య కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షులు తుమ్మలపల్లి పృథ్వీరాజ్ మాట్లాడుతూ.. ఖరీఫ్ సీజన్ మొదలవడంతో రైతులు విత్తనాలు, ఎరువులను కొనుగోలు చేస్తున్నారు. అయితే డిమాండ్ బాగా ఉన్న కొన్ని విత్తనాలను డీలర్లు అధిక డబ్బులు తీసుకుని విక్రయిస్తున్నారన్నారు. యూఎస్ 706 ఆధ్యా గత సంవత్సరం దిగుబడి బాగా వచ్చిందని.. ఈసారి ఆ విత్తనాలు డీలర్లు దొరకడం లేదన్నారు. దీంతో ప్యాకెట్‌కు రూ.1400 నుంచి 2000 వరకు తీసుకుంటున్నారన్నారు. వాస్తవానికి ఈ ప్యాకెట్‌ను రూ.853కు మాత్రమే అమ్మాలని ప్రభుత్వ నిబంధనలు ఉన్నాయన్నారు. అయినప్పటికీ రైతుల అవసరాలను ఆసరాగా చేసుకుని డీలర్లు ఇలా ఎక్కువ ధరకు విక్రయిస్తున్నారన్నారు. వెంటనే అధికారులు తనిఖీలు చేసి డీలర్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంగ్ శెట్టి, శశిధర్ జైపాల్ జలీల్, నిజాం, అర్జున్ రావు, రామ్ రెడ్డి, సంగన్న పాల్గొన్నారు.



ఇరుకు రోడ్డుతో ఇక్కట్లు

నవతెలంగాణ-కొండాపూర్

మండల కేంద్రం మీదుగా వెళుతున్న ప్రధాన రహదారి ఇరుక్కుగా ఉండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు సరిగ్గా లేకపోవడంతో తరచూ ప్రమాదాలు జరగుతున్నాయి. దీంతో వాహనదారులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణించాల్సిన దుస్థితి నెలకొన్నది. గతంలో కురి సిన వర్షాలకు వరద నీరు నిలవడంతో.. పోలీస్ స్టేషన్ దగ్గర నుంచి మ్యూజియం గడ్డపైన వరకు సుమారు 100 మీటర్ల మేర రోడ్డు అంచుల భాగంలో గుంతలు ఏర్పడ్డాయి. ఒకే సమ యంలో రెండు వాహనాలు వస్తే.. వెళ్లడం కష్టంగా మారుతున్నదని వాహనదారులు వాపోతున్నారు. రోడ్డుకు ఇరువైపులా గోడ ఉండడంతో ఎదురుగా వస్తున్న వాహనం కనిపించే అవకాశం లేకపోయింది. అటువంటి ప్రదేశాలలో కనీసం సూచిక బోర్డు లేకపో వడం ఆర్అండ్‌బి అధికారుల పనితీరుకు నిదర్శనమంటూ పలువురు ఎద్దేవా చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వెంటనే ఆ సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.




గురుకుల కాలేజీలో విద్యార్థులకు దరఖాస్తుల ఆహ్వానం



నవతెలంగాణ-రాయికోడ్

తెలంగాణ గురుకుల కళాశాలలో మిగిలిన ఇంటర్ ప్రథమ సంవత్సరం సీట్లకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ మాన్వి చంద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సీట్ల భర్తీకి ఈనెల 6 నుంచి 15వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవచ్చున్నారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు మీసేవా సెంటర్లలో www.res.ac.ts.inద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. విద్యార్థులు ఈ యొక్క అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.



మున్సిపాలిటీ అభివృద్ధికి సహకారం అందిస్తాం

ఎమ్మెల్యే మదన్ రెడ్డి



నవ తెలంగాణ-నర్సాపూర్ : నర్సాపూర్ మున్సిపాలిటీ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్ రెడ్డి అన్నారు. బుధవారం నర్సాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డులో రూ.30 లక్షలతో వేస్తున్న సీసీ రోడ్డు పనులను ఎమ్మెల్యే మదన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకట గోపాల్, మున్సిపల్ వైస్ చైర్మన్ నహీముద్దీన్, వైస్ ఎంపీపీ వెంకట నర్సింగ్ రావు ,పీఏసీఎస్ చైర్మన్ రాజు యాదవ్, మండల పార్టీ అధ్యక్షులు భోగచంద్రశేఖర్, కౌన్సిలర్ లక్ష్మీ నాగేష్, నాయకులు హబీబ్ ఖాన్, పంబల బిక్షపతి, జగదీష్, జ్ఞానేశ్వర్, ఆంజనేయులు గౌడ్, శ్రీనివాస్ గౌడ్, పాల్గొన్నారు.

సింగల్ ఫేస్ స్టార్టర్‌ను ధ్వంసం చేసిన మందుబాబులు



నవ తెలంగాణ-నర్సాపూర్ : మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో కొందరు మందుబాబులు వీరంగం సృష్టించారు. తాగిన మైకంలో గ్రామంలో గల సింగల్ ఫేస్ మోటర్ స్టార్టర్‌ని బండరాళ్ల ఎత్తేసి ధ్వంసం చేశారు. స్టార్టర్ చెడిపోవడంతో గ్రామంలో తీవ్ర నీటి ఎద్దడి ఏర్పడింది. కొన్ని రోజుల క్రితం కూడా స్టార్టను బండరాళ్ల వేసి ధ్వంసం చేశారని గ్రామస్తులు ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు ధ్వంసం చేసిన వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు.

మోకు దెబ్బ మండల అధ్యక్షునిగా భూమా గౌడ్

నవతెలంగాణ-టేక్మాల్ : మోపు దెబ్బ మండల అధ్యక్షునిగా కోటగిరి భూమా గౌడ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు మోకు దెబ్బ వ్యవస్థాపక అధ్యక్షుడు జల్క వీరస్వామి గౌడ్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. తనపై నమ్మకం ఉంచి తనకు ఈ పదవి కట్టబెట్టినందుకు, గౌడ కులస్తులను ఏకధాటిపై తీసుకువచ్చి వారి అభివృద్ధి కోసం కృషి చేస్తానన్నారు. ప్రభుత్వ పరంగా వచ్చే సంక్షేమ పథకాలను ప్రతి కుటుంబానికి అందేలా చూస్తామని చెప్పారు.

బసవేశ్వర ఎత్తిపోతలతో సస్యశ్యామలం



నవతెలంగాణ-టేక్మాల్

ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న మండల ప్రజల ఆకాంక్ష నెరవేరే సమయం ఆసన్నమైందని ఆందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ అన్నారు. గురువారం బసవేశ్వర సంగమేశ్వర ఎత్తిపోతల పథకం శంకుస్థాపన చేసిన భూమి పూజ చేసిన అనంతరం ఆయన ఫోన్లో మాట్లాడారు. ఎంతోకాలంగా ఎదురు చూస్తున్న టేక్మాల్ మండల ప్రజలకు, సింగూరు జలాలు గుండుబాగులో కలపాలని, కమ్యూనిస్టులు ఎన్నో పోరాటాలు చేశారని గుర్తు చేశారు. కేసీఆర్ ఆదేశాలతో మెదక్ జిల్లాలో బసవేశ్వర సంగమేశ్వర ప్రాజెక్టుతో ఆ కోరిక నెరవేరనున్నదని ఆయన చెప్పారు.

దశాబ్ది ఉత్సవాలు చేసుకోవడం ఎంత వరకు సమంజసం

బీజేపీ జిల్లా అధ్యక్షుడు గద్దం శ్రీనివాస్ డిమాండ్



నవతెలంగాణ-నిజాంపేట్

తొమ్మిదేళ్ళ పాలనలో దశాబ్ది ఉత్సవాలు చేసుకోవడం ఎంత వరకు సమాంజసమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గద్దం శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలో బీజేపీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో జరిగిన అభివృద్ధిపై దశాబ్ది ఉత్సవాలు నిర్వహించడంపై ప్రజా ధనాన్ని లూటీ చేయడమేనన్నారు. చెరువు పండుగ సందర్భంగా ఈ నియోజక వర్గంలో ఎక్కడైనా సాగు నీరు అందించిన దాఖలాలు ఉన్నాయా అని అన్నారు. ఒకవేళ సాగు నీరు వస్తే కేసీఆర్, హరీష్ రావు, శేరి సుభాష్ రెడ్డి పామ్ హౌజ్‌లకు మాత్రమే నీరు అందాయన్నారు. రామాయంపేట రెవెన్యూ డివిజన్ కోరకు ఆనాడు మంత్రి హరీష్ రావు ఇచ్చిన మాట నిలుపుకోలేదని ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి కూడా డివిజన్ ఏర్పాటుకై సుముఖత వ్యక్తం చేయడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఇంచార్జ్ రాజేంద్రప్రసాద్, అసెంబ్లీ కన్వీనర్ ఎక్కలదేవు మదు, అసెంబ్లీ విస్తారక్ సురేష్ బీజేపీ సీనియర్ నాయకుడు మావురం లక్ష్మణ్, మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, ఉపాధ్యాక్షుడు రాజిరెడ్డి, ప్రదాన కార్యదర్శి మహంకాళి నరేష్, పట్టణ అధ్యక్షుడు చంద్రశేఖర్, రేగుల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను అడుకుంటామన్న బీజేపీ నాయకులు

ముందస్తు అరెస్టు చేసి కొల్చారం పోలీస్ స్టేషన్‌కు తరలించిన పోలీసులు



నవతెలంగాణ-చిలిపిచేడ్

అజ్జమర్రి గ్రామంలో మంజీర నది పైన చెక్ డ్యామ్ ప్రారంభోత్సవానికి వస్తున్న ఎమ్మెల్యే మదన్ రెడ్డిని అడ్డుకుంటామని హెచ్చరించారు. బుధవారం పోలీసులు ముందస్తుగా బీజేపీ నాయకులను అరెస్ట్ చేసి కొల్చారం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం బీజేపీ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాల పేరుతో ప్రచార కార్యక్రమాలు చేస్తూ రైతులను పట్టించుకోవటం లేదన్నారు. గ్రామాలలో వడ్లు కొనుగోలు కేంద్రాల నుంచి తీసుకుపోవటానికి లేని శ్రద్ధ ఉత్సవాల పేరుతో మాయమాటలు చెప్పే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు వెంకటేశం కార్యదర్శిలు శ్రీకాంత్ గౌడ్ సంతోష్, మాజీ సర్పంచ్ నగేష్, సత్యనారాయణ, బూత్ అధ్యక్షుడు యాదగిరి, అశోక్, దశరత్, మహేష్, లక్ష్మణ్, చంద్రగౌడ్,, బద్రి తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి పుస్తె మట్టెలు పంపిణీ



నవతెలంగాణ-చిలిపిచేడ్

మండల పరిధిలోని చిట్కుల్ గ్రామానికి చెందిన మన్నే యేసయ్య కూతురు సుకన్య వివాహానికి బుధవారం చిట్కుల్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు తార విష్ణువర్ధన్ రెడ్డి పుస్తెమట్టెలు పంపిణీ చేశారు. అనంతరం తార విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ నిరుపేదలకు అండగా ఉంటానన్నారు. మండలంలో ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టామని ముందు మరెన్నో చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భూమయ్య, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు వెంకట్ రెడ్డి, నరేందర్, పల్లె కిష్టయ్య పాల్గొన్నారు.

గ్రామ గ్రామాన ఉత్సవాలు నిర్వహించాలి

హుస్నాబాద్ ఎంపీపీ మానస



నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

ప్రతి గ్రామంలోని చెరువుల వద్ద అభివృద్ధి తీరుపై సంబరాలు నిర్వహించాలని హుస్నాబాద్ ఎంపీపీ లకావత్ మానస సుభాష్ అన్నారు. బుధవారం హుస్నాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచులు ఎంపీటీసీలు కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో మిషన్ కాకతీయలో జరిగిన చెరువులో అభివృద్ధిని గుర్తు చేసుకునేలా సంబరాలు జరపాలన్నారు. ఈ కార్యక్రమంలోఎంపిడిఓ కుమారస్వామి ఎంపీ ఓ సత్యనారాయణ,, సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

ముంపు గ్రామంలో ఆరోగ్య శిబిరం



నవతెలంగాణ-ములుగు

మండల పరిధిలోని ముంపు గ్రామాలైన మామిడాల సబ్ సెంటర్ గ్రామంలో అనుమానిత డెంగ్యూ వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలో ఏడు సంవత్సరాల బాబు జ్వరంతో మరణించాడు. అయితే గ్రామస్తులు డెంగ్యూతో మరణించాడని అనుమానించారు. దీనికిగాను జిల్లా మలేరియా సిబ్బంది ములుగు వైద్య సిబ్బంది బుధవారం ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా రక్తపూతలు 54. రక్త నమూనాలు 13 సేకరించారు. గ్రామంలో డెంగ్యూ మలేరియా రాకుండా తీసుకోవాల్సిన నివారణ పద్ధతుల గురించి గ్రామస్తులకు వైద్య సిబ్బంది సర్వే నిర్వహించి వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి డాక్టర్ ప్రభాకర్ పి హెచ్ సి వైజాగ్ డాక్టర్ దీప్తి వైద్య బృందం పాల్గొన్నారు.

బహుజనులు రాజ్యాధికారం సాధించుకోవాలి

ప్రచార కమిటీ ఉపాధ్యక్షుడు సదన్ మహారాజ్



నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్ : బహుజనులు రాజ్యాధికార సాధన కొరకు ధర్మ సమాజ్ పార్టీ నిరంతరం ముందుంటుందని ధర్మ సమాజ్ పార్టీ ప్రచార కమిటీ ఉపాధ్యక్షుడు బోయిని సదన్ మహారాజ్ అన్నారు. బుధవారం హుస్నాబాద్, అక్కన్నపేట, కొహెడ మండల ప్రతినిధుల సమావేశంలో ఇంటింటి ప్రచార కరపత్రిక ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో ఎన్నో ఏళ్లుగా ఎన్నో ఉద్యమాలు జరిగాయని, అవన్నీ అగ్రకులాల నాయకత్వంలోనే జరిగాయని అందుకే రాజ్యాధికారం, సంపద చెక్కు చెదరకుండా వారి చేతుల్లోనే ఉందన్నారు. ప్రతి పేదవాడు స్వేచ్ఛగా ఆత్మగౌరవంతో బతకడం ధర్మసమాజ్ పార్టీతోనే సాధ్యమవుతుందన్నారు. హుస్నాబాద్ మండల నాయకులు చెంచల ఎల్లన్న, ప్రవీణ్, వెంకటేశ్, రామకృష్ణ, వొద్దిరాల సతీష్, శంకర్, అంజి తదితరులు పాల్గొన్నారు.

చెరువుల పండుగను విజయవంతం చేయాలి

రాష్ట్ర నాయకులు మండల పార్టీ అధ్యక్షులు పురం మహేశ్వర్

నవతెలంగాణ-తూప్రాన్ రూరల్ (మనోహరాబాద్)



తెలంగాణ రాష్ట్రం సాధించి పదవ సంవత్సరంలోకి వెలుతున్న సమయంలో ముఖ్యమంత్రి కేసీఆర్ చేపట్టిన దశాబ్ది ఉత్సవాలలో భాగంగా నేటి చెరువుల పండగ కార్యక్రమాన్ని మండలంలోని గ్రామాలలో ప్రజలు మత్స్యకారులు, కుల సంఘాల ఆద్వర్యంలో ఘనంగా నిర్వహించాలని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బాషబోయిన చంద్రశేఖర్ ముదిరాజ్, మండల పార్టీ అధ్యక్షులు పురం మహేశ్వర్ ముదిరాజ్, ముదిరాజ్ మహాసభ నాయకులు, కూచారం గ్రామ కమిటీ అధ్యక్షులు దాసరి నరేష్ ముదిరాజ్‌లు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని దండుపల్లిలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణను ముఖ్యమంత్రి కేసీఆర్ అనేక సంక్షేమ ప్రజోపయోగ పథకాలతో రాష్ట్రాన్ని బంగారు తెలంగాణగా మార్చినట్టు తెలిపారు. రాష్ట్రంలోని అన్ని కులాలకు మతాలకు పథకాలను అందుబాటులో ఉంచి ఆదుకుంటుంది కేవలం కేసీఆర్ అన్నారు. దశబ్ది ఉత్సవాలలో భాగంగా నేడు చేపట్టే చెరువుల పండగ కార్యక్రమంలో మత్స్య కారులు, వివిధ కుల సంఘాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని ర్యాలీగా చెరువుల వద్దకు వెళ్లి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించిన అనంతరం ప్రజలతో కలిసి భోజనాలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని మండలంలోని ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు పంజా భిక్షపతి, రంగాయిపల్లి సర్పంచ్ నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-పెద్ద శంకరంపేట్

తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నేడు ఊరూరా నిర్వహించనున్న చెరువుల పండుగను విజయవంతం చేయాలని పేట ఎంపీపీ జంగం శ్రీనివాస్ కోరారు. గ్రామాల్లోని చెరువు కట్టలపై నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమంలో అన్ని వర్గాల ప్రజలు రైతులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని ఈ ఉత్సవాలను జయప్రదం చేయాలన్నారు.

అపర భగీరథుడు సీఎం కేసీఆర్

- అజ్జమర్రిలో చెక్ డ్యాం ప్రారంభోత్సవం
- ఎమ్మెల్యే మదన్ రెడ్డి, మహిళ కమిషన్ చైర్పర్సన్ సునీతా రెడ్డి
- మెదక్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా





నవతెలంగాణ-చిలిపిచేడ్

రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు చరిత్రలో అపర భగీరథుడుగా నిలిచారని నర్సాపూర్ ఎమ్మెల్యే చిలుముల మదన్ రెడ్డి, రాష్ట్రమహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీత లక్ష్మారెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలలో సాగునీటి వారోత్సవాల భాగంగా మండల పరిధిలోని అజ్జమర్రి గ్రామంలో మంజీరా నదిపై నిర్మించిన చెక్ డ్యామ్‌ను కలెక్టర్ రాజర్షి షా, అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్‌తో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి గ్రామ మహిళలు బోనాలతో అధికారులకు నాయకులకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ ఒకప్పుడు ఎడారిలా ఉండే తెలంగాణ ఇప్పుడు సాగునీటి ప్రాజెక్టులతో జలకళ సంతరించుకుందని తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ముందుచూపుతో ప్రాజెక్టులు, చెరువులు నింపడంతో గ్రామాలన్ని పచ్చని పంటలతో సస్యశ్యామలం అయ్యాయన్నారు. పద్నాలుగు సంవత్సరాలు కొట్లాడి సాధించుకున్న తెలంగాణ అన్ని రంగాలలో బీఆర్ఎస్ హయాంలో ముందుకు సాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో లేబర్ కమిషన్ చైర్మన్ దేవేందర్ రెడ్డి, ఇరిగేషన్ ఈఈ శ్రీనివాస్, ఈఈ మల్లయ్య, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యకుడు అశోక్ రెడ్డి, ఎమ్మార్వో ముసదిక్, ఎంపీడీవో శశిప్రభ, వైస్ ఎంపీపీ విశ్వంబర్, శివంపేట్ ఎంపీపీ హరికృష్ణ, కొల్చారం జడ్పీటీసీ మేఘమాల సంతోష్, కౌడిపల్లి బీఆర్ఎస్ పార్టీ, అధ్యక్షుడు రామాగౌడ్, మండల టీఆర్ఎస్ పార్టీ ఉపాధ్యక్షుడు, ఆత్మ కమిటీ డైరెక్టర్ మల్కాని వీరస్వామితోపాటు మండల సర్పంచులు ఎంపీటీసీలు నాయకులు ప్రజలు పాల్గొన్నారు.

గోపాల మిత్ర సేవలు వినియోగించుకోవాలి



నవతెలంగాణ-పెద్ద శంకరంపేట్

మండల పరిధిలోని కొత్తపేట గ్రామంలో తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల సందర్భంగా బుధవారం జిల్లా పశు గణాభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో మేలుజాతి దూడల ప్రదర్శన నిర్వహించారు. గ్రామ సర్పంచ్ పి. కే అనంతరావు మేలు జాతి లేగ దూడలకు నట్టల నివారణ మందులు వేయించారు. సర్పంచ్ పీకే అనంతరావు మాట్లాడుతూ గోపాలమిత్రుల సేవలు ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని, పుట్టిన లేగదూడలకు నట్టల నివారణ మందులు వేయించాలన్నారు. గోపాలమిత్ర సూపర్వైజర్ మెదక్ ఎం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ పాడి పశువులు ఎద లక్షణాలు గేదలు 24 నుంచి 36 గంటలు, ఆవుల్లో 18 నుంచి 24 గంటలు ఉంటాయన్నారు. ఎద లక్షణాలను గుర్తించి సకాలంలో గోపాల మిత్రులతో కృత్రిమ గర్భధారణ చేయించుకోవాలన్నారు. గేదెలలో ముర్రా , మైసాని ఆవులలో గిర్ ,సాయివాల్, ఒంగోలు, దియోని హెచ్‌ఎఫ్ .జెర్సీ . విరనాళికలు అందుబాటులో ఉన్నాయని రైతుకు నచ్చిన వీరాన్ని తమ పశువుకు వేసుకోవచ్చని కృత్రిమ గర్భధారణ వలన మేలు జాతి దూడలు పుట్టడం వలన వ్యవసాయానికి పనులకు మరియు పాల ఉత్పత్తులు గణనీయంగా పెరుగుతాయని రైతుకు నచ్చిన వీర్యాన్ని పశువులకు వేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో గోపాలమిత్ర పి మల్లేశం గౌడ్ పాడి రైతులు సాయిలు , సంగయ్య, అమృత రావు, దానల్, సాయిలు, దత్తు విట్టల్ ,సాయిలు, అనిల్ కుమార్ , శ్రీమంన్ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

నామమాత్రంగా నిర్వహించిన సర్వసభ్య సమావేశం
ఎంపీపీ పురం నవనీత రవిముదిరాజ్



నవతెలంగాణ-తూప్రాన్ రూరల్ (మనోహరాబాద్)

వచ్చేది వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాదులపై వైద్య శాఖ సిబ్బంది డాక్టర్లు అప్రమత్తంగా ఉండాలని ఎంపీపీ పురం నవనీత రవిముదిరాజ్ సూచించారు. బుధవారం మనోహరాబాద్ మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ పురం నవనీత రవిముదిరాజ్ అధ్యక్షతన ఎంపీడీవో యాదగిరిరెడ్డి నిర్వహించారు. సమావేశాన్ని గజ్వేల్‌లో నిర్వహిస్తున్న తెలంగాణ దశాబ్ది ఉత్సవాలకు హాజరుకావాల్సి ఉండడంతో సమావేశాన్ని నామమాత్రంగా మమ అనిపించే విధంగా ముగించారు. వివిధ శాఖల అధికారుల నివేదికలను వినకుండానే సమావేశాన్ని అర్ధాంతరంగా ముగించి వెళ్లిపోయారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ వచ్చే వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని మందులు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. అలాగే విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో వ్యవసాయ పొలాల్లో లూజ్ వైర్లు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, దాంతో రైతులు విద్యుత్ ఇబ్బందులకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను మండలంలోని సర్పంచ్‌లు ప్రజాప్రతినిధులు ఉత్సాహంగా పాల్గొని నిర్వహిస్తున్నారని, ఇంకా జరిగే కార్యక్రమాలను కూడా ప్రతి ప్రజాప్రతినిధి పాల్గొని విజయవంతం చేసి మండలానికి మంచి పేరును తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ భిక్షపతి, మండల వైస్ ఎంపీపీ యంజాల విఠల్‌రెడ్డిలతో పాటు మండలంలోని ఎంపీటీసిలు, అధికారులు పాల్గొన్నారు.

గ్రామాల్లో చేసిన అభివృద్ధి పనులకు బిల్లులు లేవు

- తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు ఎలా నిర్వహించాలి
- మండల సమీక్ష సమావేశంలో సర్పంచుల ఆవేదన



నవ తెలంగాణ-హవేలీ ఘనపూర్

తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులు చేసిన ప్రజా ప్రతినిధులకు బిల్లులు సకాలంలో మంజూరు కాక అవస్థలు పడుతున్నామని మండల సర్పంచులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా గ్రామాలలో సర్పంచులు చెరువు కట్టలపై ఉత్సవాలు నిర్వహించాలని ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎంపీపీ నారాయణరెడ్డి ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 2018 పంచాయతీ రాజ్ చట్టంలో లేని పనులు ఎలా చేపడతామని గతంలో నిర్వహించిన కంటి వెలుగులో చేసిన పనులకు బిల్లులు రాలేదని దశాబ్ది ఉత్సవాల్లో ఎలా పనిచేయాలని మండిపడ్డారు. ఈ సందర్భంగా సర్పంచులు మాట్లాడుతూ గ్రామాలలో చెరువుల వద్ద తెలంగాణ రాష్ట్ర ఉత్సవాలు నిర్వహించడం తమ వల్ల కాదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో గతంలో చేసిన పనులకు బిల్లులు రాక అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పష్టమైన హామీ లభిస్తేనే ఉత్సవాలు నిర్వహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి, మండల ప్రత్యేక అధికారి విజయలక్ష్మి, తహసీల్దార్ నవీన్ కుమార్, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రాజేందర్ రెడ్డి, సర్పంచులు యామిరెడ్డి, లక్ష్మీనారాయణ, మంద శ్రీహరి, సుభాష్, ఎంపిటిసి రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

శబాష్ పల్లిలో బొడ్రాయి ప్రతిష్ట మహోత్సవాలకు విరాళం

జెడ్పీటీసీ పబ్బ మహేష్ గుప్త



నవతెలంగాణ-నర్సాపూర్

మండలంలోని శబాష్ పల్లి గ్రామంలో నిర్వహిస్తున్న బొడ్రాయి ప్రతిష్ఠ మహోత్సవాలకు జిల్లా ఆర్థిక, ప్రణాళిక సంఘం సభ్యులు, శివ్వంపేట జెడ్పీటీసీ పబ్బ మహేష్ గుప్త తన స్వంత డబ్బులను రూ.25 వేల విరాళాన్ని బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ పబ్బ మహేష్ గుప్త మాట్లాడుతూ గ్రామాలలో భక్తిభావం పెంపొందడం అభినందనీయమన్నారు. దేవాలయాల అభివృద్ధికి తన వంతు సహకారం తప్పకుండ అందిస్తానన్నారు. బొడ్రాయి ప్రతిష్ఠకు విరాళం అందించిన జెడ్పీటీసీ పబ్బ మహేష్ గుప్తకు గ్రామస్తుల తరుపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు గ్రామ సర్పంచ్ రంగపల్లి పార్వతి సత్యం అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ జోడు సాయినాథ్, సత్యనారాయణ, బిక్షపతి, విజయ్, సురేష్, బాలేష్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.



సేవాలాల్ ఉత్సవాలకు విరాళం అందజేత

శివంపేట మండలం లచ్చిరెడ్డిగూడెం గ్రామ పంచాయతీ శివయ్యగూడ తండాలో సేవాలాల్ జయంతి ఉత్సవాలకు జెడ్పీటీసీ పబ్బ మహేష్ గుప్తా విరాళం నగదు రూ.21 వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అశోక్ రెడ్డి, ఎంపీటీసీ సురేందర్ రెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షులు గోవర్ధన్ రెడ్డి, ఇంద్రేష్ బద్దు రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రగతిని పరుగులు పెట్టించిన కేసీఆర్

నాచారం టెంపుల్ మాజీ చైర్మన్ కొట్టాల యాదగిరి




నవతెలంగాణ- గజ్వేల్

ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో అవతరించిన తెలంగాణ రాష్ట్రం తొమ్మిది సంవత్సరాల్లో జరిగిన ప్రగతి పరుగులు పెట్టించారని నాచారం టెంపుల్ మాజీ చైర్మన్ కొట్టాల యాదగిరి అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో 70 సంవత్సరాలైనా తెలంగాణ ప్రాంతం ఎలాంటి అభివృద్ధి చెందలేదని, తొమ్మిది సంవత్సరాల్లోనే తెలంగాణ రాష్ట్రం పంటలతో సస్యశ్యామలంగా కనిపిస్తుందన్నారు. దీనికంతటికి కెసిఆర్ చేస్తున్న పరిపాలన ప్రగతి వైపు నడుస్తుంది అన్నారు. మంత్రి హరీష్ రావు పర్యవేక్షణలో గజ్వేల్ నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుంది అన్నారు. దశాబ్ది ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించు కుంటున్నామని ఆయన చెప్పారు. జూన్ 2 నుండి 22 వరకు నిర్వహించు కుంటున్నాం అంటే 20 రోజులపాటు తెలంగాణ ప్రగతిని గ్రామ గ్రామాన ప్రజలకు వివరిస్తున్నామన్నారు. పేదలకు అన్ని సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత కెసిఆర్ కి దక్కిందన్నారు.

చేపల పండుగ నిర్వహించడం హర్షణీయం

మత్స్య కార్మిక సంఘం జిల్లా డైరెక్టర్



నవ తెలంగాణ కొండపాక

తెలంగాణ ప్రభుత్వం చేపల పండుగను అధికారికంగా నిర్వహించడం గర్వించదగ్గ విషయం అని మత్స్య కార్మిక సంఘం జిల్లా డైరెక్టర్ తేలు ఇస్తారు అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో దశబ్ద ఉత్సవాల సందర్భంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా మత్స్య అభివృద్ధి అధికారి బి మల్లేశం గారి అధ్యక్షతన జరిగిన సమా వేశంలో మత్స్య కార్మిక సంఘం జిల్లా డైరెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం చేపల పండుగ ప్రభుత్వమే జరుపాలని చెప్పడం మనకు శుభ పరిణా మం అని చెప్పుకోవచ్చు కానీ జిల్లాలో రాష్ట్రంలో గ్రామాలలో మండలాలలో మత్స్య సొసైటీలు చెరువులు ఉన్నప్పటికీ రియల్ ఎస్టేట్ అభివృద్ధి వల్ల చెరువులో రాత్రికి రాత్రే కబ్జాలై మాయమైన పరిస్థితి ఉంది ఉన్నారు ఇలాంటి పరిస్థితిలో ఈ దశబ్ద ఉత్సవాలని జరిపాలని ప్రభుత్వం ఆదేశించడం మంచిది అన్నారు ప్రభుత్వ అధికారులు, జిల్లా ఎక్స్ డైరెక్టర్ ఆకారం సత్తయ్య పెండ్యాల ఐలయ్య తొడంగి శోభ మత్స్యకారుల సంఘం జిల్లా నాయకులు గ్రామాల నుండి వచ్చిన సొసైటీ అధ్యక్షులు మండల అధ్యక్షులు గ్రామ సభ్యులు పాల్గొన్నారు.

గతంలో నీళ్ల గోస..నేడు కళ్లముందే జలకళ



నవ తెలంగాణ-దుబ్బాక

గతంలో దుబ్బాకలో ఎటు చూసినా నీళ్లగోస ఉండేదని, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రమొచ్చాక కళ్లముందే జలకళ కనిపిస్తుందని మున్సిపల్ చైర్ పర్సన్ గన్నె వనిత భూమిరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ ఏర్పడక ముందు దుబ్బాకలో ఎండిపోయిన చెరువులు,కుంటలు కనిపించేవని, నేడు ఎండాకాలంలోనూ చెరువులు, కుంటలు జలకళను సంతరించుకున్నాయని నొక్కి చెప్పారు. బుధవారం దుబ్బాకలో ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సాగునీటి దినోత్సవం కార్యక్రమంలో మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి తో కలిసి ఆమె పాల్గొన్నారు. గతంలో దుబ్బాక వాసులకు తాగునీరు రాక కిలోమీటర్ల కొద్దీ బోర్లకాడికి పోయి నీళ్లు తెచ్చుకునే దుస్థితి ఉండేదని గుర్తు చేశారు.నేడు మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికి త్రాగునీరు, మల్లన్న సాగర్ కాలువల ద్వారా పంట పొలాలకు సాగునీరును అందిస్తున్న ఘనత సీఎం కేసీఆర్ దేననని స్పష్టం చేశారు. ఇరిగేషన్ ఎస్ఇ బస్వరాజ్,వైస్ చైర్ పర్సన్ అధికం సుగుణ బాలకిషన్ గౌడ్, కౌన్సిలర్లు,ఎంపీపీ కొత్త పుష్పలత రెడ్డి, ఏఎంసీ చైర్మన్ చింతల జ్యోతి కృష్ణ, పిఎసిఎస్ చైర్మన్ కైలాష్, ఇరిగేషన్ ఈఈ లు,డిఈ లు,ఏఈ లు పలువురున్నారు.

కొట్యాలలో ఘనంగా విగ్రహాల ప్రతిష్ట మహోత్సవం

నవతెలంగాణ ములుగు : ములుగు మండలం కొట్యాల గ్రామంలో కొండ,కోనల మధ్య ప్రకృతి వడిలో నిర్మించిన శ్రీశ్రీశ్రీ మల్లికార్జున స్వామి,లింగ ప్రతిష్ఠ,నంది ధ్వజస్తంభ ప్రతిష్టా కార్యక్రమాలను స్థానిక సర్పంచ్ గంగిశెట్టి గణేష్ గుప్తా ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాలను శ్రీ భవానంద ఆశ్రమ పురోహితులు అప్పాల సత్యానారాయణ శర్మ, విటల్ శర్మ,రసరాజ శర్మ,రాధాపతి శర్మ, బావానంద శర్మల ఆధ్వర్యంలో హెూమాధి కార్యక్రమాలతోపాటు సోమవారం నుంచి స్వామివార్లకు పుష్పాదివాసం,జలాది వాసం,ధాన్యాధివాసం అనంతరం ప్రతిష్ట కార్యక్రమాలు నిర్వహించారు.కార్యక్రమంలో మెదక్ పార్లమెంట్ సభ్యుడు కొత్త ప్రభాకర్ రెడ్డి,ఎమ్మెల్సీ యాదవ రెడ్డి,ఎఫ్డిసి చైర్మన్ ప్రతాపరెడ్డి,ఎర్రోళ్ల శ్రీనివాస్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించగా వారిని శాలువాలతో గణేష్ గుప్త సత్కరించారు,మార్కెట్ కమిటీ చైర్మన్ జహంగీర్, పిఏసిఎస్ చైర్మన్ అంజిరెడ్డి రాష్ట్ర యువత విభాగం ఉపాధ్యక్షులు జుబేర్ పాషా పిఏసిఎస్ వైస్ చైర్మన్ కుక్కల నరేష్ గౌడ్, మర్కుకు బి ఆర్ ఎస్ మండల అధ్యక్షుడు కరుణాకర్ రెడ్డి కాంగ్రెస్ ములుగు మండల అధ్యక్షుడు శ్రీనివాస్ గుప్తాలు పాల్గొన్నారు.

పిల్లలను ప్రభుత్వ బడిలోనే చదివించాలి



నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

గ్రామంలోని ప్రతి పిల్లవాడిని ప్రభుత్వ పాఠశాలలోనే చదివించాలని గ్రామ సర్పంచ్ పోలవేణి లత సంపత్ అన్నారు. బుధవారం హుస్నాబాద్ మండలంలోని తోటపల్లి గ్రామ సర్పంచ్, ఉపాధ్యాయులు ఇంటింటికి తిరుగుతూ పిల్లలను ప్రభుత్వ బడికి పంపించాలని ప్రచారం చేపట్టారు. ప్రభుత్వ బడిలో అన్ని విధాల సౌకర్యాలు ఉన్నాయని తల్లిదండ్రులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పోలవేణి లత సంపత్, ఉపాధ్యాయులు, సిబ్బంది గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ



నవతెలంగాణ-చిన్నకోడూరు

మండలంలోని వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో గ్రామాల్లో బీటీ రోడ్ల నిర్మాణం చేపడతామని చిన్నకోడూరు ఎంపిపి కూర మాణిక్య రెడ్డి అన్నారు. సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం కస్తూరిపల్లి గ్రామంలో బిటి రోడ్ల నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి హరీష్ రావు సహకారంతో బీటీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరైనట్లు తెలిపారు. బీటీ రోడ్ల నిర్మాణంతో ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా పోతాయన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి మెదక్ జిల్లా గొర్రెల పెంపకం దారుల సహకార సంఘం చైర్మన్ శ్రీహరి యాదవ్, సర్పంచ్ల ఫోరం మండల అధ్యక్షులు ఉమేష్ చంద్ర, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షులు శ్రీనివాస్, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కుంటయ్య, సర్పంచ్లు పద్మ గోవింద గిరి స్వామి యాదవ్, ఐలయ్య యాదవ్, ఎంపీటీసీ పద్మ మల్లేశం గౌడ్, బిఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మహేందర్ రెడ్డి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సరైన విధానంలో ఉపాధ్యాయుల సర్దుబాటు చేయండి



నవతెలంగాణ-సిద్దిపేట

సరైన విధానంలో ఉపాధ్యాయుల సర్దుబాటు చేయాలని టిపిటీఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు విజేందర్ రెడ్డి, మల్లికార్జున్ కోరారు. ఈ విద్యా సంవత్సరం ఎలాంటి ఒడిదొడుకులు లేకుండా సరైన విధానం అవలంబించాలని టిపిటీఎఫ్ ఆధ్వర్యంలో డీఈవో కార్యాలయం సెక్టోరియల్ ఆఫీసర్ రామస్వామికి బుధవారం వినతిపత్రం అందజేశారు. గత సంవత్సరం లో రద్దు అయిన బిల్లులకు మళ్లీ రీ టోకెన్ జారీ చేయాలన్నారు. ఉపాధ్యాయుల సర్దుబాటుపై సరైన విధానం రూపొందించి, జూన్ 12 కు ముందే ఆ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. రాగి జావ పంపిణీ కి స్కూల్ పాయింట్ లోనే మెటీరియల్ అందించాలని, హెడ్ మాస్టర్ లను విద్యార్థుల యూనిఫార్మ్ కుట్టించడం కోసమే కాకుండా దుస్తుల పంపిణీ ప్రక్రియకు మాత్రమే బాధ్యులని చేయాలని కోరారు. ఉచిత పాఠ్యపుస్తకాలు అన్నిటైటిల్స్ స్కూలు తెరిచేలోపు పాఠశాలలకు అందించాలనీ, 317 జీవో అమలు విషయం లో అధికారుల తప్పిదం ద్వారా నష్ట పోయిన ఉపాధ్యాయులకు న్యాయము చేయాలని కోరారు.

ముఖ్యమంత్రి ఆదేశాలు బుట్ట దాఖలు

- అధ్వానంగా గజ్వేల్ పాండవుల చెరువు
- పట్టించుకోని టూరిజం అధికారులు
- గడ్డిలో మునిగిపోయిన పాండవుల విగ్రహాలు







నవతెలంగాణ-గజ్వేల్

ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాలను టూరిజం శాఖ అధికారులు బుట్ట దాఖలు చేశారు. పాండవులు చెరువును సందర్శించిన ముఖ్యమంత్రి కేసీఆర్ పాండవుల విగ్రహాల వద్ద సుందరీకరణ చేయాలని, అక్కడనే మహా శివుని విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. టూరిజం శాఖ అధికారులు మాత్రం 8 సంవత్సరాలు గడుస్తున్న ఇప్పటివరకు పట్టించుకోలేదు. ముఖ్యమంత్రి ఆదేశాలను టూరిజం శాఖ అధికారులు ఏ స్థాయిలో పట్టించుకున్నారో ఒక్క మాటలో చెప్పొచ్చు. పాండవులు గడ్డిలో మునిగిపోయినా పట్టించుకోవడం లేదు. ముఖ్యమంత్రి కూడా ఆదేశించిన ఇరిగేషన్, టూరిజం శాఖ అధికారులు గాలికి వదిలేయడంతో దీని వెనుక ఎవరున్నారని స్థానిక ప్రజలు మండిపడుతున్నారు. 2016లో ముఖ్యమంత్రి కేసీఆర్ గజ్వేల్ లో పర్యటించి పాండవులు చెరువు పరిశీలించారు. మినీ ట్యాంక్ బండ్ గా మారుస్తానని చెప్పి హామీ ఇచ్చారు. ఇరిగేషన్, టూరిజం శాఖ అధికారులు నామమాత్రంగా పనిచేసే వదిలేసారు. టూరిజం స్పాట్ గా తీర్చిదిద్దేందుకు రూ.4.50 కోట్లు మంజూరు చేశారు. నిధులు ఖర్చయినా పనులు మాత్రం పెద్దగా కనిపించడం లేదు. పాలకులు చెప్పినంత గొప్పతనం పాండవులు చెరువు పై కల చెదిరిపోయింది. చెరువుపై ఏర్పాటు చేసిన అన్ని పరికరాలు తుప్పుబట్టి మూలకు పడ్డాయి. రైలు బండ్లు కూర్చునే కుర్చీలు, డప్పు డోలు విరిగిపోయాయి. నిర్వాణ లోపంతో వస్తువులు పాడైపోయాయి. అల్లా దాహంతో కూర్చున్న గజ బోల నిర్మాణాలు చెదలు పట్టాయి. పిల్లల ఆట వస్తువులు విరిగిపోయాయి. ఫలహారశాల గది పగిలిపోయి పగుళ్లు వచ్చింది. సంగీత పరికరాలు ఆనవాళు లేవు చెరువులో ప్రజలు విహరించేందుకు ఏర్పాటు చేసిన బోటు విరిగిపోవడంతో వాటికి తాళం వేశారు. ప్రస్తుతం గజ్వేల్ పాండవుల చెరువు దుస్థితి. మిషన్ కాకతీయ పథకంలో ప్రభుత్వం గజ్వేల్ పాండవుల చెరువు మినీ ట్యాంక్ బండ్ అభివృద్ధి చేసింది. చిన్నారు చిన్నాన్న రైలు బండి ఉయ్యాలలు తెలుగు బండి టెక్కింగు స్తంభాలు జారుడుబండలు గతంలో ఏర్పాటు చేశారు తిరు బండారాలు విక్రయించేందుకు ఫలహార శాల ఏర్పాటు చేశారు. ఏడాది పాటు మొదట్లో నిత్యం వందలాదిమంది సందర్శకులతో నిండుగా ఉండేది. పిల్లలు ఆడుకునేందుకు ఏమీ లేకపోవడంతో సందర్శ సంఖ్య తగ్గిపోయింది ప్రస్తుతం పెద్దలకు పది రూపాయలు చిన్నరులకు ఐదు రూపాయల రుసుము వసూలు చేస్తున్నారు. టూరిజం శాఖ అధికారులు పాండవుల చెరువు సందర్శించిన దాఖలా లేవు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలపై పట్టింపు లేదు. సౌకర్యాలు ఏమీ లేకుండా డబ్బులు వసూలు చేస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు. చెరువు అవతల ఉన్న పంట పొలాలకు ప్రత్యేక దారి ఏర్పాటు చేయకపోవడంతో చెరువు కట్టపై ఉండే ట్రాక్టర్లు పశువులు శివయాత్రలు సాగిస్తున్నారు ఫలితంగా చెరువు పరిసరాల దుర్గంధంగా తయారయింది పాండవుల చెరువుకు పూర్వం తీసుకురావాలని స్థానికులు ఎన్నోసార్లు చెప్పినా స్థానిక టూరిజం, ఇరిగేషన్ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా రైతులకు పొలాలకు వెళ్లేందుకు ప్రత్యేక దారి తోపాటు చెరువు చుట్టూ మరింత సుందరీకరణ చేయాలని స్థానికులు కోరుతున్నారు. అదే విధంగా ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాలు అమలు చేయాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.



యువ కవి రాజుకు బహుమతి

నవతెలంగాణ-సిద్దిపేట

పాలపిట్ట మాస పత్రిక, వాసా ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహించిన కవితల పోటీలో సిద్దిపేటకు చెందిన యువ కవి వేల్పుల రాజు ప్రత్యేక బహుమతి అందుకున్నారు. మంగళవారం రాత్రి హైద్రాబాద్ లో త్యాగరాయ గాన సభలో నిర్వహించిన కార్యక్రమం లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సలహాదారులు కె వి రమణాచారి చేతుల మీదుగా నగదు పురస్కారం అందుకున్నారు. సిద్దిపేట కవులు, సాహితీ వేత్తలు, అక్షర సేద్యం ఫౌండేషన్ అధ్యక్షుడు భైతి దుర్గయ్యసుగుణ సాహితీ సమితి అధ్యక్షుడు మొసర్ల మాధవరెడ్డి, సభ్యులు రాజు ని అభినందించారు.

మాదిగల జనాభా ప్రకారం 13 ఎమ్మెల్యే సీట్లు కేటాయించాలి

- దేవులపల్లి రాజేందర్ మాదిగ డిమాండ్



నవతెలంగాణ-నంగునూరు

మాదిగల జనాభా ప్రకారం రాబోయే ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలోని పార్టీలన్నీ మాదిగలకు 13 ఎమ్మెల్యే, 2 ఎంపీ స్థానాలను కేటాయించాలని ఎమ్మార్పీఎస్ టీఎస్ జిల్లా అధికార ప్రతినిధి దేవులపల్లి రాజేందర్ మాదిగ డిమాండ్ చేశారు. బుధవారం నంగునూరు మండల కేంద్రంలో కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో మాదిగల జనాభా 70 లక్షలకు పైగా ఉంటుందని రాష్ట్ర సాధన ఉద్యమంలో మాదిగలు ప్రముఖ పాత్ర వహించారన్నారు.రాబోయే ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో అన్ని పార్టీలు మాదిగలకు 13 అసెంబ్లీ సీట్లు కేటాయించాలనీ ఈనెల 30న చలో హైదరాబాద్ విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు.ఈ కార్యక్రమంలో మండల వర్కింగ్ ప్రెసిడెంట్ లింగాల నరసింహులు, కొంకటి బాబు, నాగిళ్ల రవీందర్, దమ్మగళ్ళ బిక్షపతి, దేవులపల్లి మహేందర్, దేవులపల్లి నితిన్, కందికట్ల సామెల్ తదితరులు పాల్గొన్నారు.

మర్కుక్‌లో కేంద్ర జలశక్తి అభియాన్ అధికారుల పర్యటన



నవతెలంగాణ-మర్కుక్

సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలంలో పలు గ్రామాల్లో బుధవారం కేంద్ర ప్రభుత్వ జల శక్తి అభియాన్ నుంచి శ్రీ వేదవీర్ ఆర్య, జాయింట్ సెక్రటరీ, టి. మాధవ్, టెక్నికల్ ఆఫీసర్ ఆధ్వర్యంలో పాతూర్ గ్రాంపంచాయితిలో రూఫ్ టాప్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్, ఇప్పలగూడెంలో కెనాల్ బండ్ ప్లాంటేషన్, మర్కుక్‌లో నర్సరీ, కమ్యూనిటీ ప్లాంటేషన్, పిపివి, బిపివి, ఎర్రవల్లిలో ఆయిల్ పామ్ పంటలను పరిశీలించారు. అనంతరం కేంద్ర జల శక్తి అభియాన్ అధికారులు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులు బాగున్నాయని గ్రామస్థాయిలో ఇంత చక్కటి పార్కులు నర్సరీలు మంచిగా ఉన్నాయని కితాబిచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇంత అభివృద్ధి చేస్తున్న సర్పంచులను అధికారులను అభినందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎపీడీలు కౌసల్యాదేవి, ఓబులేష్, ఉద్యానవన శాఖ అధికారి సునీత,హెచ్ వో సౌమ్య,నెటాఫీమ్ అగ్రానమిస్ట్ సుబ్బారావు, ఎంపీడీవో ప్రవీణ్, , ఈసీ రాజు, మర్కుక్ పంచాయతీ కార్యదర్శి మౌన, ఏఈవోలు రజనీకాంత్, విష్ణు, ఎంపీడీవో కార్యాలయ అధికారులు తదితరులున్నారు.

ఎంపీ బ్రిజ్‌భూషణ్‌ను కఠినంగా శిక్షించాలి

- సీఐటీయూ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

నవతెలంగాణ-దుబ్బాక

అంతర్జాతీయ అవార్డులు సాధించిన భారత మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడ్డ రెజ్లర్ల ఫెడరేషన్ అధ్యక్షుడు, బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ చరణ్ సింగ్‌ను వెంటనే అరెస్టు చేసి చట్టరీత్యా కఠినంగా శిక్షించాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి జి.భాస్కర్ డిమాండ్ చేశారు. బుధవారం దుబ్బాక పట్టణ కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ బిజెపి ఎంపీ బ్రిజ్ భూషణ్ చరణ్ సింగ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ రెండు నెలలుగా మహిళా రెజ్లర్లు పోరాటం చేస్తున్నా కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. అవార్డులు సాధించిన రెజ్లర్లకే అన్యాయం జరిగినప్పుడు దేశంలోని సాధారణ మహిళల పరిస్థితి ఏంటని ఆవేదన వ్యక్తం చేశారు. బేటీ బచావో బేటీ పడావో అన్న మోడీ సర్కార్ ఈ ఘటనపై ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. దీనిపై ప్రధాని మోదీ నోరు విప్పకపోవడం శోచనీయమన్నారు. రేపిస్టులకు మోడీ ప్రభుత్వం రక్షణ కల్పిస్తుందని మండిపడ్డారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వమేర్పడిన నాటి నుండి మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. రెజ్లర్లకు న్యాయం జరిగే వరకు సీఐటీయూ వారికి మద్దతుగా ఉంటుందని స్పష్టం చేశారు. సీఐటీయూ దుబ్బాక టౌన్ కన్వీనర్ కొంపెల్లి భాస్కర్, నాయకులు మల్లేశం, రాములు, లక్ష్మి, శ్యామల, మంజుల, జ్యోతి, వాసవి, కనకవ్వ ఉన్నారు.



బీజేపీ ఎంపీ బ్రిజు భూషణ్‌ను వెంటనే అరెస్టు చేయాలి

నవతెలంగాణ-దౌల్తాబాద్

రేజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బిజెపి ఎంపీ బ్రిజ్ భూషణ్‌ను వెంటనే అరెస్టు చేయాలని దౌల్తాబాద్ మండల కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో షకార్డులతో నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ దౌల్తాబాద్ మండల కన్వనర్ చిలుక లక్ష్మి మాట్లాడుతూ అంతర్జాతీయంగా అవార్డులు సాధించిన మహిళ రెజ్లర్ల మీద రెజ్లర ఫెడరేషన్ అధ్యక్షులు బిజెపి పార్లమెంటు సభ్యుడు బ్రిజూ భూషణ్ చరణ్ సింగ్ లైంగిక వేధింపులకు పాల్పడ్డాడని, ఆయన మీద చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని రెండు నెలలుగా రేజ్లర్లు పోరాటం చేస్తున్నా అరెస్ట్ చేయకపోవడం అన్యాయమన్నారు. వెంటనే ఎంపీ బ్రీజు భూషణ్ పై చర్యలు తీసుకోవాలని



డిమాండ్ చేశారు. నరేంద్ర మోడీ ప్రధానమంత్రి అయిన తర్వాత మహిళలపై దాడులు పెరిగాయని మహిళలకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తంచేశారు. అంతర్జాతీయ అవార్డులు పొందిన రేజ్లార్లకే న్యాయం జరగనప్పుడు సాధారణ మహిళల పరిస్థితి ఏంటని ఆవేదన వ్యక్తం చేశారు. రెజ్లర్లను లైంగిక వేధింపులకు గురిచేసిన వ్యక్తిని వెంటనే అరెస్టు చేయకుండా రక్షణ కల్పించడం సరైంది కాదన్నారు. కేంద్రంలో బిజేపీ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి మహిళలకు రక్షణ లేకుండా పోయిందని, రేపిస్టులకు రక్షణ పెరిగిందని విమర్శించారు. రేజ్లర్లకు న్యాయం చేసే వరకు సీఐటీయూ మద్దతు ఉంటుందన్నారు. కార్యక్రమంలో సిఐటియు వివిధ రంగాల కార్మికులు రవి, స్వామి, బాబు, భాల్ రాజు, లింగం, సత్తయ్య, నర్సింలు,మంజుల, అనిత, సునిత, శ్యామల, ప్రతిభ,ప్రశాంత్, సరోజన తదితరులు పాల్గొన్నారు.

అన్ని చెరువుల వద్ద జనం సందడి

- మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్

నవతెలంగాణ -గజ్వేల్

గజ్వేల్ నియోజకవర్గంలో ఉన్న అన్ని చెరువు కుంటల వద్ద గురువారం ప్రజలతో మమేకమై కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ అన్నారు. బుధవారం మార్కెట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మిషన్ కాకతీయతో చెరువులన్నీ జలకళగా మారగా దశాబ్ది ఉత్సవాలు బాగా జనంతో సంయుక్త భోజనాలు ఏర్పాటుచేసి చెరువు కింద ఉన్న రైతులతో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేస్తున్న మన్నారు. ఒక గజ్వేల్ నియోజకవర్గం లోని లక్ష ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంగా ముఖ్యమంత్రి చెరువు కుంటలతో పాటు కొండ పోచమ్మ ప్రాజెక్టును గజ్వేల్ నియోజకవర్గం లో 15 టీఎంసీలతో నిర్మాణం చేపట్టారని ఇప్పుడు అనేక జిల్లాలకు సాగునీరు అందించడం కాకుండా గజ్వేల్ నియోజకవర్గం లక్ష ఎకరాలకు సాగునీరు అందించేందుకు జనవరి వరకు పూర్తి లక్ష్యం మారుతుందని ఆయన చెప్పారు. ఇప్పటికే అనేక కాలువలు పూర్తి అయినప్పటికీ పిల్ల కాలువలు చివరి దశలో నిర్మాణంలో ఉన్నాయని ఆయన చెప్పారు. దశాబ్ది ఉత్సవాలు బాగా చెరువుకుంటలపై ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు దశాబ్దాలు ఉత్సవాల్లో భాగంగా చెరువు కట్టలపై జనం కలగా మారుస్తామన్నారు. రైతులు ప్రజలు భారీ ఎత్తున తరలించి చెరువుల వద్ద ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేస్తున్న మన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి హరీష్ రావు కృషితో గజ్వేల్ నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని ఆయన తెలిపారు. ధాన్యం కొనుగోలు శరవేగంగా జరుగుతుందని రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సంబంధిత శాఖ అధికారులు మార్కెట్ కమిటీ పాలకవర్గం చర్యలు తీసుకుంటుంది అన్నారు.



అయిల్‌పామ్ పంటలతో అధిక లాభాలు

- జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సునీత

నవతెలంగాణ-మర్కుక్

ఆయిల్‌పామ్ సాగుతో రైతులకు అధిక లాభాలు వస్తాయని ఉద్యానవన శాఖ జిల్లా అధికారి సునీత తెలిపారు. బుధవారం మండలంలోని ఎర్రవల్లి, నర్సన్నపేటలో అయిల్ పామ్ పంటలను పరిశీలించారు. రైతులకు అయిల్ పామ్ పంటలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆయిల్ పామ్ సాగు చేసి రైతులకు తెలంగాణ ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తున్నదని తెలిపారు. ఈ పంట సాగుతో 4-30 ఏండ్ల వరకు నిరంతర ఆదాయం పొందవచ్చన్నారు. చీడపీడల బెడద ఉండదన్నారు. వేరుశనగ, పెసర, మినుము, నువ్వులు, పొద్దుతిరుగుడు, తదితర అంతర పంటల ద్వారా ఆదాయం పొందవచ్చన్నారు. బ్యాంకుల ద్వారా రుణ సాయం అందుతుందన్నారు. ఆయిల్ పామ్ సాగుకు దాదాపు అన్ని రకాల నేలలు అనుకూలంగా ఉంటాయని తెలిపారు. ఎకరానికి రూ.1,25,000 వరకు ఆదాయం పొందవచ్చని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని వివరించారు.సుమారు 20 లక్షల మెట్రిక్ టన్నుల అయిల్ అవసరముందన్నారు.ప్రస్తుతం మనం 10 లక్షల మెట్రిక్ టన్నుల అయిల్ పండిస్తున్నమన్నారు.కావున అయిల్ కొరత ఉన్నందున రైతులు లాభసాటి ఉన్న అయిల్ పామ్ పంటలను రైతులు సాగుచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ డివిజన్ ఉద్యానవ శాఖ అధికారి సౌమ్య,నెటాపిమ్ అధికారులు,ఏఈవోలు అశ్వీని,విష్ణు, తదితరులున్నారు.



బీజేపీ, కాంగ్రెస్ ఓట్ల మాటలను ప్రజలు నమ్మరు

- సిద్దిపేట జిల్లా పరిషత్ చైర్మన్ రోజా శర్మ

నవతెలంగాణ-గజ్వేల్

బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నాయకులు చెప్పే ఓట్ల మాటలను ప్రజలు నమ్మే స్థితిలో లేరని మళ్లీ అధికారం తెలంగాణ ప్రభుత్వానిదేనని సిద్దిపేట జిల్లా పరిషత్ చైర్మన్ ఏలేటి రోజా రాధాకృష్ణశర్మ అన్నారు. బుధవారం స్థానిక మహతి ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన గజ్వేల్ నియోజకవర్గం సాగునీటి దినోత్సవం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. తెలంగాణ ప్రాంతానికి కేంద్రం ఏమి ఒరగపెట్టిందని ఓట్లు అడుగుతుందని, అధికారంలో ఉండగా కాంగ్రెస్ ప్రజలకు చేసిందేముందని ఓట్లు అడుగుతారని ఆమె ప్రశ్నించారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన 9 సంవత్సరాల అభివృద్ధిని ప్రజలకు వివరించేందుకు దశాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తుండగా ఓర్వలేని బీజేపీ, కాంగ్రెస్ పిచ్చి కూతలు కూస్తున్నాయని ఆమె మండిపడ్డారు. ముఖ్యమంత్రి కేసీఆర్ కృషి వల్ల తెలంగాణ ప్రాంతం మొత్తం జల కలగా మారిందని ఆమె తెలిపారు. రైతులకు సాగునీరు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కిందన్నారు. మంత్రి హరీష్ రావు కృషితో ప్రాజెక్టులు శరవేగంగా పూర్తి అయినట్లు ఆమె తెలిపారు. అనంతరం మెదక్ ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి, తెలంగాణ ఫారెస్ట్ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్, రాష్ట్ర రైతుబంధు సమితి సభ్యులు దేవి రవీందర్, గ్రంథాల సంస్థ చైర్మన్ లక్కిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ పథకాలు దేశంలో అగ్రస్థానంలో నిలిచాయన్నారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ అధికారులు హరే రామ్, ఎస్సీ వేణు, బాలాజీ, ప్రవీణ్, బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు భూమిరెడ్డి,, కృష్ణారెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, ఎంపీపీలు అమరావతి, పాండు గౌడు, బాలేశం గౌడ్, జెడ్పీటీసీ మల్లేశం, మంగమ్మ రామచంద్రం, మున్సిపల్ వైస్ చైర్మన్ జకీర్, వెంకటేశం గౌడ్, మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు రజిత, బాలమణి, చందు, గజ్వేల్ నియోజకవర్గం చెందిన అన్ని స్థాయిల ప్రజాప్రతినిధులు ఇరిగేషన్ అధికారులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



వరి సాగును ముందుకు తెద్దాం



నవతెలంగాణ-నంగునూరు

వానాకాలం వరిని ముందస్తుగా సాగు చేద్దామని వ్యవసాయ విస్తరణ అధికారి సాయివర్మ తెలిపారు. బుధవారం నంగునూరు మండలం సిద్ధన్నపేట గ్రామంలో పంట సాగును ముందుకు, యాసంగి పంటలను ప్రకృతి వైపరీత్యాలనుండి కాపాడుకుందామనే కరపత్రాలు,వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ బెదురు తిరుపతి, రైతుబంధు సభ్యుడు జనార్దన్ రెడ్డి, మల్లేశం, నాయకులు భాస్కర్ రెడ్డి, మల్లారెడ్డి, సత్తిరెడ్డి,నర్సింలు, రాజమల్లు, శ్రీనివాస్ రెడ్డి, కిష్టారెడ్డి, తిరుపతిరెడ్డి, కైలాస్, దుర్గయ్య, కొండల్ రెడ్డి, భరత్ రెడ్డి, సంజీవరెడ్డి, వీరారెడ్డి, రాకేష్ రెడ్డి, లక్ష్మయ్య, రైతులు పాల్గొన్నారు.

మైనార్టీలకు కులవృత్తుల పథకం అందజేయాలి

- కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తూ ఇమామ్



నవతెలంగాణ-సిద్దిపేట

రాష్ట్ర ప్రభుత్వం కులవృత్తి, చేతి వృత్తులకు అందించే ఆర్థిక సహాయం పథకం మైనార్టీలకు కూడా అందచేయాలని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తూ ఇమామ్ డిమాండ్ చేశారు. సిద్దిపేటలో ఆయన మాట్లాడుతూ కుల వృత్తులకు ఆర్థిక సహాయం 1 లక్ష రూపాయలు అందించేందుకు ప్రభుత్వం ముందుకు వచ్చిందని, అందులో మైనార్టీలకు ఎందుకు స్థానం కల్పించలేదని అన్నారు. మైనార్టీలలో ఎంతోమంది నిరుపేదలుగా ఉన్నారని, ఆయా వృత్తులు చేసుకుంటూ జీవనం చేస్తున్నారని అన్నారు. మైనార్టీలలో వృత్తులు చేస్తున్న అర్హులైన వారిని గుర్తించి వారికి లక్ష రూపాయలు ప్రభుత్వం అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రధానకార్యదర్శి గ్యదారి మధు, యువజన కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు గయాజుద్దీన్, మైనార్టీ పట్టణ ఉపాధ్యక్షుడు ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఊరూరా చెరువుల పండగ



నవతెలంగాణ -నంగునూరు

నంగునూరు మండలం లోని వివిధ గ్రామాల్లో నేడు ఊరూరా చెరువుల పండుగ కార్యక్రమం చేపడుతున్నట్లు తహసీల్దార్ దిలీప్ నాయక్ తెలిపారు. బుధవారం నంగునూరు మండలం లోని రాంపూర్ గ్రామంలో గద్ద మోని కుంట చెరువు వద్ద ఏర్పాటు చేసిన పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ దశాబ్ది ఉత్సావాల్లో భాగంగా నంగునూరు మండలంలోని 24 గ్రామాల్లో గుర్తించిన 24 చెరువు పరివాహక ప్రాంతాల్లో చెరువుల పండుగను నిర్వించనున్నట్లు పేర్కొన్నారు. ఆయా గ్రామాల్లోని ప్రజా ప్రతినిధులను కలుపుకొని విజయవంతం చేయాలని కోరారు.నాయకులు పర్శ రాములు గౌడ్, ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్, కూలీలు, గ్రామస్థులు పాల్గొన్నారు

ప్రభుత్వ కళాశాలలో నాణ్యమైన విద్య

- ప్రిన్సిపాల్ సురేష్ రెడ్డి



నవతెలంగాణ-దౌల్తాబాద్

తెలంగాణ రాష్ట్రంలో జూన్ 1వ తేదీ నుంచి ప్రభుత్వ కళాశాలల్లో నూతన విద్యా సంవత్సరం పునః ప్రారంభమయ్యాయి. కళాశాల అధ్యాపక బృందం, ప్రిన్సిపాల్ సురేష్ రెడ్డి అధ్వర్యంలో పల్లె పల్లెకు, గడపగడపకు వెళ్తూ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాముఖ్యతను, రాష్ట్రంలో ప్రభుత్వ విద్య ఆవశ్యకతని, కళాశాలలో ప్రభుత్వం కల్పించిన నాణ్యమైన ఉచిత విద్య, ఉచిత పాఠ్యపుస్తకాలు ఇతర మౌలిక వసతుల కల్పన గురించి తల్లిదండ్రులకు, విద్యార్థినీ విద్యార్థులకు వివరిస్తున్నారు. కళాశాలలో నూతన విద్యార్థుల చేరికలను ప్రోత్సహిస్తూ, పెద్ద ఎత్తున అడ్మిషన్లే లక్ష్యంగా ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం అవిశ్రాంతంగా గ్రామ గ్రామాన పర్యటిస్తున్నారు. ఇప్పటికే సగం పైగా లక్ష్యాన్ని చేరుకోవడం చాలా ఆనందంగా ఉందని కళాశాల ప్రిన్సిపాల్ ఆనందం వ్యక్తం చేశారు. వారు అధ్యాపకులను అభినందిస్తూ, ఇదే విధంగా రానున్న రోజుల్లో మరిన్ని అడ్మిషన్లు సాధించి నాణ్యమైన విద్యను అందించి మెరుగైన ఫలితాలను సాధించి సిద్దిపేట జిల్లాకు మంచి పేరు ప్రఖ్యాతులు తెస్తామన్నారు. అదేవిధంగా మార్చి ఫలితాలలో ప్రభుత్వ జూనియర్ కళాశాల దౌల్తాబాద్‌కు చెందిన కారింగుల వర్ష అనే విద్యార్థిని సిద్దిపేట జిల్లాలో మొదటి ర్యాంకును, అదేవిధంగా రాష్ట్ర వ్యాప్తంగా 9వ ర్యాంకును సాధించిన సందర్భాన్ని గుర్తుచేస్తూ, ఆమెని అభినందించారు. ఈ కార్యక్రమంలో రాజు, సుధాకర్, లక్ష్మీనారాయణ, దయానంద్, సంపత్, శ్రీనివాస్ రెడ్డి, మంగ్యా, శ్రీనివాస్, శివ కుమార్, భాగ్యమ్మ, నాగేశ్వర రావు, పవన్ కుమార్ తదితర అధ్యాపకులు పాల్గొన్నారు.

కాళేశ్వరంతో గ్రామాల్లో జలకళ



నవతెలంగాణ-చిన్నకోడూరు

నెర్రెలు బారిన చెరువులకు కాళేశ్వరం నీళ్లతో నింపడంతో గ్రామాల్లో జల కళ సంతరించుకుందని చిన్నకోడూరు ఎంపిపి కూర మాణిక్యరెడ్డి తెలిపారు. తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలలో భాగంగా గ్రామ, గ్రామాన చెరువుల పండగ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని మిషన్ కాకతీయ పథకంతో చెరువులు బాగు చేసినట్లు తెలిపారు. సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణంలో చెరువుల పండుగ కార్యక్రమంపై అధికారులతో సమావేశం నిర్వహించారు. సాగునీటి వేడుకలు ఘనంగా నిర్వహించినట్లు తెలిపారు. ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం ఎన్నో పథకాలు తీసుకొచ్చినట్టు తెలియజేశారు. సాగునీటితో ఒక్క గుంట ఎండకుంట యాసంగి మొత్తం వరి పంట పండినట్లు తెలిపారు. రైతు సంక్షేమానికి ప్రభుత్వం ఎన్నో పథకాలు తీసుకొచ్చినట్టు తెలిపారు. రైతుల కళ్ళల్లో ఆనందం చూడడమే ప్రభుత్వ లక్ష్యం అని అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వనిత రవీందర్ రెడ్డి, గంగాపురం సొసైటీ చైర్మన్ కనకరాజు, అల్లిపురం సొసైటీ చైర్మన్ సదానందం, సర్పంచ్ల ఫోరం మండల అధ్యక్షులు ఉమేష్ చంద్ర, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షులు శ్రీనివాస్, అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఊర చెరువుల పండుగకు విరాళం



- మాజీ జెడ్పీటీసీ సింగం సత్తయ్య

నవతెలంగాణ-మర్కుక్

రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మర్కుక్ మండలంలోని గ్రామాల్లో నిర్వహిస్తున్న ఊర చెరువుల పండుగలకు 12 గ్రామ పంచాయతీల సర్పంచులకు బీఆర్ఎస్ సీనియర్ నేత మాజీ జెడ్పీటీసీ సింగం సత్తయ్య రూ.20 వేల చొప్పున విరాళం బుధవారం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం కేసీఆర్ ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్ళాలని కోరారు. పండుగలా చెరువుల పండుగలను నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు అప్పాల ప్రవీణ్ కుమార్, మెతుకు మంజుల శ్రీరాములు, దుద్దెడ లక్ష్మీ రాములు గౌడ్, చాడ ప్రసన్న సుధాకర్ రెడ్డి, అప్పాల స్వరూప మల్లేశం, పుట్ట మంజుల నర్సింలు, గాజే నర్సింలు, గడ్డం ప్రసాద్, ఉప్పరి అరుణ నర్సింలు, గంగాపూర్-యూసుప్ ఖాన్ పల్లి గ్రామాధ్యక్షులు జంపల్లి శ్రీనివాస్ యాదవ్ తదితరులున్నారు.

మిషన్ కాకతీయకు లక్ష విరాళం



నవతెలంగాణ-గజ్వేల్

మిషన్ కాకతీయ పథకానికి గజ్వేల్ మున్సిపల్ పరిధిలోని ప్రజ్ఞాపూర్‌లో ఉన్న సెంట్ మేరీ ఇంగ్లీష్ మీడియం పాఠశాల నిర్వాహకులు గోపి ఇన్నారెడ్డి మిషన్ కాకతీయ పథకానికి లక్ష రూపాయలు విరాళం ఇచ్చారు. బుధవారం మహతి ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన సాగునీటి దశాబ్ది ఉత్సవాల దినోత్సవం లో భాగంగా ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి, తెలంగాణ ఫారెస్ట్ చైర్మన్ ప్రతాపరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్, రైతు సమితి సభ్యులు దేవి రవీందర్, స్పెషల్ అధికారి ముత్యం రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ రోజా శర్మ, మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, ఇరిగేషన్ అధికారులు హరే రామ్, వేణు, బాలాజీ, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సంప్రదాయ నృత్యాలతో భవిష్యత్తుకు బాటలు

- మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల



నవతెలంగాణ-సిద్దిపేట

నేటితరం పిల్లలు చదువుతోపాటు సాంప్రదాయక నృత్యాలపై దృష్టి సారిస్తే వారి భవిష్యత్తు బాగుంటుందని మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల అన్నారు. భవాని క్లాసికల్ డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో పేరిణి, ఆంధ్ర నాట్యం, కూచిపూడి శిక్షణ తీసుకుంటున్న చిన్నారులకు సర్టిఫికేట్లను అందజేశారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలను తిలకించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ టౌన్ ప్రెసిడెంట్ కొండం సంపత్ రెడ్డి, 5వ వార్డు కౌన్సిలర్ వినోద్ గౌడ్, 27వ వార్డు కౌన్సిలర్ సద్ది నాగరాజురెడ్డి, శిక్షకురాలు డా. భవాని విజయ్ తదితరులు పాల్గొన్నారు.

బడీడు పిల్లలను బడిలో చేర్పించాలి



నవతెలంగాణ-నంగునూరు

బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని మండల విద్యాధికారి తగిరెడ్డి దేశిరెడ్డి అన్నారు. బుధవారం నంగునూరు మండల కేంద్రంలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాటలో భాగంగా నంగునూరులో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాల కన్నా ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్యాబోధన అందించడం జరుగుతుందన్నారు. ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, మధ్యాహ్న భోజనం, రెండు జతల దుస్తులను అందించడం జరుగుతుందని పేర్కొన్నారు. తల్లిదండ్రులు గమనించి ప్రభుత్వ పాఠశాలలోని చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు రవీంద్రారెడ్డి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు మనీష్ కుమార్, ఉపాధ్యాయులు, సిఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి రంగంలో విప్లవాత్మక ప్రగతి

- ఎంపీపీ కొత్త పుష్పలత కిషన్ రెడ్డి

నవతెలంగాణ-దుబ్బాక రూరల్



రాష్ట్ర అవతరణ నుంచి నేటి వరకు బీఆర్ఎస్ సర్కార్ సాగు నీటి రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి అద్భుతమైన ప్రగతిని సాధించిందని, మల్లన్న సాగర్, రంగనాయక సాగర్, కొండపోచమ్మ సాగర్ ప్రాజెక్టు నిర్మించి కాల్వల ద్వారా రైతులకు సాగునీరు అందించిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని దుబ్బాక ఎంపీపీ కొత్త పుష్పలత కిషన్ రెడ్డి అన్నారు. బుధవారం దుబ్బాక మండల కేంద్రంలోని బాలాజీ గార్డెన్ లో దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సాగునీటి దినోత్సవం కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా మిషన్ కాకతీయ ప్రాజెక్టు ద్వారా 46 వేల చెరువులను పునరుద్ధరించారు. తద్వారా ఆ చెరువుల్లోకి మల్లన్న సాగర్, రంగనాయక్, కొండపోచమ్మ సాగర్ ద్వారా గోదావరి జలాలతో నింపడంతో భూగర్భజలాలు పెరిగాయన్నారు. నియోజకవర్గంలో లక్షల ఎకరాలకు పైగా నీరు అందుతుందని, గతంలో రైతులు ఎన్ని బోర్లు వేసినా చుక్క నీరు పడక రైతన్నలు అప్పుల్లో కూరుకున్నారన్నారు. నేడు ఆ పరిస్థితి లేదన్నారు. బీడు భూములను చదును చేస్తూ రైతన్నలు గోదావరి జలాలతో పంటలు పండిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ గన్నే భూమ్ రెడ్డి, ఎస్ ఇ బస్వరాజ్ , ఈఈ వేణు బాబు, రవీందర్ రెడ్డి, సాయి బాబా, డీఈ హరికిషన్, శ్రీనివాస్, శిరీష్, శ్రీనివాస్, సీతారామరాజు, ఏఈ విష్ణు వర్ధన్ రెడ్డి, జునైద్ అలీ, అమర్, మాల్లోజు, జెడ్పిటీసీలు, ఎంపిటీసీలు, సర్పంచులు తదితరులు ఉన్నారు.

గజ్వేల్ మహిళా డిగ్రీ కాలేజీలో దశాబ్ది ఉత్సవాలు

నవాతెలంగాణ-ప్రజ్ఞాపూర్

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న దశాబ్ది ఉత్సవాల్లో గజ్వేల్ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినిలు తమ వంతు బాధ్యతగా నిర్వహించారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఉమాశశి అన్నారు. కమిషనర్ ఆదేశాలతో కళాశాలలో కల్చరల్ కమిటీ కన్వీనర్ శ్రీమతి శ్రీలత వివిధ రంగాలలో పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలలో భాగంగా తెలంగాణ రాష్ట్ర ప్రజాహిత సంక్షేమ పథకాలు వ్యాసరచన పోటీలు నిర్వహించామన్నారు. ఈ పోటీలలో పి.శృతి బీకాం ప్రథమ బహుమతి పొందగా, ఎం. చందన ద్వితీయ బహుమతి సాధించరన్నారు. తెలంగాణ సంస్కృతి, సంగీతం, సాంప్రదాయాలు, వంటలు ఆచారాలలో వక్తృత్వ పోటీలలో టి.స్నేహాంజలి ప్రథమ బహుమతిని సాధించని పేర్కొన్నారు. అంతేకాకుండా పాటలు, డాన్స్,డ్రాయింగ్ పోటీలలో కుమారి శ్రీవాణి, ప్రవళిక, రేఖ, సంధ్యారాణి, మానసలు ప్రథమ, ద్వితీయ బహుమతులు గెలుచుకున్నారన్నారు. తెలంగాణ రాష్ట్ర సంక్షేమ పథకాలు అయినా రైతుబంధు, రైతు బీమా, కల్యాణ లక్ష్మి,షాదీ ముబారక్, మిషిన్ భగీరథ, మిషన్



కాకతీయ, కేసీఆర్ కిట్టు, దళిత బంధు, తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలు, ఆచారాలు, వంటలు గురించి విద్యార్థినులు చాలా క్లుప్తంగా ఆసక్తిగా వివరించామన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ పి. జయరాజు, డాక్టర్ అనిత,డాక్టర్ జ్యోతి,సుమలత, ఉమారాణి, సరోజన, నీలిమ, కవిత, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన డిప్లొమా కోర్సులో దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-ములుగు

శ్రీ కొండ లక్ష్మణ్ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం, ములుగు, సిద్దిపేట జిల్లా వారు ఉద్యాన డిప్లొమ తెలంగాణ కోర్సు ఇంగ్లీషు మీడియం లో ప్రవేశం కొరకు ధరఖాస్తులను ఆహ్వానించడమైనది. ఆసక్తి గలవారు 2023-24 విద్యా సంవత్సరానికై పదవ తరగతి పాసైన లేదా పాలీసెట్-2023 నందు అర్హత పొందిన లేదా ఇంటర్ ఫెయిల్ అయిన వారు ఈ డిప్లొమా కోర్సులో చేరేందుకు అర్హులు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 1. హార్టికాల్చురల్ పాలిటెక్నిక్, రామగిరి ఖిల్లా, కరీంనగర్ జిల్లా, 2. హార్టికాల్చురల్ పాలిటెక్నిక్, దస్నాపూర్, ఆదిలాబాద్ జిల్లా, 3. గ్రామాచారతి హార్టికాల్చురల్ పాలిటెక్నిక్, మర్రిగూడ, నల్గొండ జిల్లా, 4. విశ్వదరణి హార్టికాల్చురల్ పాలిటెక్నిక్, తొర్రూరు, మహబూబాబాద్ జిల్లా, 5. గంటా గోపాల్ రెడ్డి హార్టికాల్చురల్ పాలిటెక్నిక్, గడ్డిపల్లి, నల్గొండ జిల్లా, ఐదు పాలిటెక్నిక్ కళాశాలల్లో 200 సీట్లు ఉన్నవి. ప్రతి కళాశాలకు 40 సీట్లు కలవు. 2 సం.రాల ఉద్యాన డిప్లొమ పూర్తి చేసిన విద్యార్థులకు ఉద్యాన డిగ్రీ కోర్సులలో 15% సీట్లను కేటాయిస్తూ వారికి అవకాశం కల్పించడం జరిగింది. తెలంగాణ రాష్ట్రం ఉద్యాన డిప్లొమా పూర్తి చేసిన విద్యార్థులకు ఉన్నత చదువుల కొరకై ఇతర సంప్రదాయ డిగ్రీలలో చేరే అవకాశం కల్పించింది. విశ్వవిద్యాలయము ఉద్యాన డిప్లొమ కోర్సు కొరకు తేదీ 31-05-2023 నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది. దరఖాస్తు బ్రోచర్, దరఖాస్తు పత్రం, పూర్తి వివరాలకు వెబ్ సైట్‌లో చూడాలన్నారు.

చేర్యాలలో ఎస్సీ హాస్టల్ నూతన భవనాన్ని ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-చేర్యాల

చేర్యాల పట్టణంలో ఉన్న ఎస్సీ హాస్టల్‌కు నూతన భవనాన్ని ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రెడ్డమైన అరవింద్, దాసరి ప్రశాంత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో బుధవారం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఎస్సీ హాస్టల్‌ని తొలగించి బిసి హాస్టల్ లోకి ఎస్సీ హాస్టల్ విద్యార్థులను బీసీ హాస్టల్ లోకి పంపి కొద్దికాలంలో హాస్టల్‌ని ఏర్పాటు చేస్తామని చెప్పి ఇప్పటివరకు ఏర్పాటు చేయకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు



ఎదుర్కొంటున్నారన్నారు. ఈ విషయంలో ఎలాంటి స్పందన లేదని, ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి ఎస్సీ హాస్టల్‌కు నూతన భవనాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమాలు నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో డివిజన్ నాయకులు ఆముదాల రంజిత్ రెడ్డి, ఎర్రి రాకేష్, శంకర్, మహేష్, రాకేష్ పాల్గొన్నారు.

రైతులు వరినార్లు రోహిణి కార్తెలో వేసుకోవాలి



- మర్కుక్ ఎవో నాగేందర్ రెడ్డి

నవతెలంగాణ-మర్కుక్

వరి సాగు చేస్తున్న రైతులు తప్పనిసరిగా రోహిణి, మృగశిర కార్తీ లో తప్పనిసరిగా నార్లు పోసుకోవాలి మర్కుక్ మండల వ్యవసాయాదికారి డా.టి.నాగేందర్ రెడ్డి సూచించారు. బుధవారం 'నవతెలంగాణ'తో మాట్లాడుతూ వానాకాలంలో ఆలస్యం కావడం వలన యాసంగిలో ఆలస్యం కావాడంతో అకాల వర్షం వల్ల తీవ్ర నష్టం కలుగుతుందన్నారు. వరి కొనుగోలు సమయంలో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. రైతులు తప్పనిసరిగా వెంటనే నార్లు పోసుకోవాలని సూచించారు.

పేదింటి ఆడబిడ్డకు పుస్తె మట్టెలు పంపిణీ

నవతెలంగాణ-దౌల్తాబాద్

ఇంటి పెద్దదిక్కు లేని పేదింటి ఆడబిడ్డ వివాహానికి పుస్తె మట్టెలు అందజేసి పెళ్లికి అండగా నిలవడం జరిగిందని సోషల్ రిఫర్మేషన్ ఫౌండేషన్ అధ్యక్షురాలు, సామాజిక ప్రజా సేవకురాలు మహమ్మద్ సుల్తాన ఉమర్ అన్నారు. దౌల్తాబాద్ మండలం సూరం పల్లి గ్రామంలో నిరుపేద వధువు బండారు రేణుక వివాహానికి పుస్తే మట్టెలు, పెళ్లి చీర అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దౌల్తాబాద్ మండలం సూరం పల్లి గ్రామానికి చెందిన పొడిశెట్టి లక్ష్మి-మురళి దంపతుల మూడవ కూతురు పావని వివాహానికి పుస్తె మట్టెలు అందజేశారు. ఈ దంపతులకు ముగ్గురు కూతూర్లు, ఒక కుమారుడు ఉన్నారు. పావని తండ్రి మురళి 20 సంత్సరాల క్రితమే మరణించడంతో కుటుంబ పెద్ద దిక్కును కోల్పోయారు. అసలే నిరుపేద కుటుంబం ముగ్గురు ఆడపిల్లల పెళ్ళిల్లు చేయాలంటే



తలకు మించిన భారంగా ఉంటుంది. పావని వివాహానికి ఎస్ఆర్ ఫౌండేషన్ తరపున పుస్తె మట్టేలు అందజేశారు. ఇంకా మానవతావాదులు ఎవరైనా ఉంటే నిరుపేద వివాహానికి సహాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి పుట్ట రాజు, కోశాధికారి మహమ్మద్ ఉమర్, గ్రామస్తులు ప్రవీణ్, వినయ్, రామ గౌడ్, నరేందర్, ప్రభాకర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీని కలిసిన కోనాపూర్ గ్రామస్తులు



నవతెలంగాణ-దౌల్తాబాద్: మండల పరిధిలోని కోనాపూర్ గ్రామస్తులు బుధవారం మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా దుబ్బాకలో కలిశారు. గ్రామంలో పెండింగ్‌లో ఉన్న గ్రామపంచాయతీ భవనం, డబుల్ బెడ్ రూమ్ రెండు పడకల గృహాలను త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతి పత్రాన్ని అందజేశారు. గ్రామంలో ఉన్న దళితులకు దళిత బంధు అమలు అయ్యేలా చూడాలని ఆయనను కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సూరంపల్లి బాలవ్వ బాల నరసయ్య, వార్డు సభ్యురాలు రాజవ్వ, నరసయ్య, రాజయ్య, సిద్ధయ్య, అశోక్, ఏళ్లవ్వ, శ్రీను పాల్గొన్నారు.